

స్వచ్ఛమైన చిరునవ్వుకి.. అచ్చమైన చిరునామా..
హాస్యానందం
సంపూర్ణహాస్య మాస పత్రిక
డిశంబర్-2012
₹15/-
వెల కట్టలేని
మీ ఆనందానికి
15 రూపాయలు
ఓ లెక్కేనంటారా?
..నీ కెప్పుడో విడాకులు ఇద్దామనుకున్నా.. కానీ వంటకీ.. బట్టలుతుక్కోడానికీ ఇబ్బందవుతుందని మానేశా...


అప్రాచ్యుడా.. నా కమండలంలోని నీళ్ళన్నీ తాగేశావు.. ఇప్పుడు వీణ్ణి ఎలా శపించాలి నేను!!
అసలు నువ్వు తపస్సు చెయ్యడానికే వచ్చావా ఇక్కడికి.. అదేదో ఇంట్లోనే ఏడవలేక పోయ్యావా!!
ఏం కాయో తెలీదు.. పది రూపాయలే అంటేనా...!!
సూటిగా అడుగుతున్నా చెప్పండి.. నేనెందుకింకా బతికున్నాను... నేనెందుకింకా బతికున్నాను??
శ్రీ నరకేశ్వర్ కవితాగానం
మమ్మల్ని చంపడానికే...



హాయ్... హాసనందంగా...

హాస్యాభిమానులకు, హాస్యానందం ఆప్తులకు,
హాస్యాభివందనాలు!

బంధాలు, అనుబంధాలు అపహాస్యమైపోతున్న ఈ రోజుల్లో... హాయిగా పలకరించేందుకు కూడా ఇవాళ సుముఖంగా లేక ముక్తసరిగా పలకరిస్తున్న తీరు చాలా బాధాకరమైంది. అహంకారపు ముసుగులో కాలం వెళ్ళబుచ్చుతున్న 'ఈ' తరం- పెళ్ళిపిలుపులు కూడా ఎస్.ఎమ్.ఎస్‌లతోనే సరిపెట్టేస్తున్నారు.

గతానికి... భవిష్యత్తుకి వారధులం మనం. మంచి చెడుల సరిహద్దులను నేటి తరానికి(పిల్లలకు) చెప్పాల్సిన బాధ్యత ఎంతైనా మనమీద ఉంది.

రాబోయే కొత్తతరం మన సంస్కృతి, సంప్రదాయాలకు వారసులుగా ఎదగాలంటే మమ్మీ డాడీల సంస్కృతి నుండి అమ్మానాన్నల ఆత్మీయపిలుపుతో మొదలెట్టాలి!

ఒక చిరునవ్వుతో పలకరింపు ఎంతటి మేలైనా చేయిస్తుందనే సత్యాన్ని అర్థమయ్యేలా పిల్లలకు చెప్పాలి.

2012వ సంవత్సరంలో చివరి సంచిక ఇది.
మీ ఆదరాభిమానాలతో నవ్వులు పంచుతూ సాగుతున్న ఈ ప్రయాణంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురౌతున్నా మీ సహాయ సహకారాలే కొండంత అండగా భావిస్తూ... మరో కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సరికొత్త శీర్షికలతో...ఆరోగ్యకరమైన నవ్వులు పంచడానికి హాస్యానందం ఎల్లప్పుడూ మీతో వుంటుంది.

అందరూ నవ్వుతూ... ఆనందంగా...ఆరోగ్యంగా... వుండాలని కోరుకుంటూ...

-రాము.పి
(ఎడిటర్)

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

డిసెంబర్-2012

Publisher&Editor : Ramu.P
Associate Editor : Sudharani.P
Cartoon Editor : A.V.M
Well Wishers : Tanikella Bharani, Jaydev, Mallik
Full Pillar : Bnim
Designing : Creative Graphix
Creative Team : Tumbali Sivaji, T.Chandra Sekhar, Rampa, Surya Dubey, P.V.Narayana, Ramsheshu, P.Priyatham, Mallikarjun.U
Helper : Raviteja.S

Address : HASYANANDAM,
#8-215/4,
Near Ramalayam,
Po:YERRABALEM
Pin 522 503,
Mangalagiri Mandal,
Guntur dist.
Ph : 9849630637

email: hasyanandam @yahoo.com

Hyderabad & Telangana Marketing: Charminar News Agency,
1-6-176/1, M.G.Road,
Khandoji Bazar,
Secunderabad-3.
Ph:9346515813
And : Shams News Agency,
Abids, Hyderabad.
Ph:040-30680840/41

Smile in Every Page... Satisfaction in Every Smile

ఎక్కడ ఏ నవ్వులున్నాయో....











అట్టపోసిని: అనుష్క
కార్టూన్: హరగోపాల్

మన జనాలు



కార్టూనిష్టు...



'బొమ్మర్షి'కి జన్మదిన శుభాకాంక్షలు!

అర్ధనారీగా కన్పించే, ఎక్స్‌ట్రార్డనరీ వ్యక్తి...
పట్టు పట్టిన కార్యాచరణలో మహోన్నత శక్తి!

మనసు నవనీతంగా, చెడు వినని,చెప్పని మనస్తత్వం...
మారాజులు గుర్తించకున్నా... పట్టించుకోని తత్వం!

ఆరు దశాబ్దాలుగా చిత్రకళామకరందం అందిస్తున్న తేనెటీగ...
ఏమీ ఆశించక, అవిరామంగా, సౌరభాలు కురిపిస్తున్న మల్లెతీగ!

నాడు బుడుగు రగడల హేలితో ఆనందం పంచారు...
నేటి మేటి చిత్రకారుడెవరన్న మీమాంసకు తెరదించారు!

సవాలక్ష బొమ్మలకుపైగా వేసిన 'గీతకారుడు...
సవాలక్ష శిష్యులకు బొమ్మలతో బోధించే 'గీతాకారుడు'!

అరంగుళం పెన్సిల్‌తో అందాలు సృష్టించే బొమ్మ దేవుడా...
ఆ రంగు గుళికల విన్యాసాలతో చెరగని పాత్రలు పుట్టించే బ్రహ్మ దేవుడా!

బిరుదులాశించక, కళామతల్లి సేవలో తలైనా ఎత్తారా...
పదవులు, పొగడ్తలు, సన్మానాలు, శాలువలు ఊసే ఎత్తారా?!

ఇటు జూస్తే, నిస్తేజ పరిచే నిరాడంబర రవళి...
అటు జూస్తే, అంబరాన్ని తాకే ఊహాలోక సరళి!

ఒక 'బాపు' మా జాతి పిత... మా బాపు వ్యంగ్య చిత్రాల కితకిత...
ఒకరు కరెన్సీలో బొమ్మైతే... ఇంకొకరి బొమ్మలే కరెన్సీ!

ముళ్లపూడితో పయనం, ముళ్ళబాటలేని గమనం...
ఆరుతరాలుగా బొమ్మలు, అమ్మాయిలు,అమ్మలు ఈర్ష్యపడే మీ బొమ్మాయిలు!

చిత్రాలు, విచిత్రాలతో పండింది, బాపూ రమణీయం...
తెలుగు జాతికి వెయ్యేళ్ళకు సరిపడ కీర్తి కమనీయం!


వెయ్యేళ్ళు తెలుగు పిల్లలకు కడుపులు నింపే అప్పచ్చుల వడ్డన...
తెలుగు నేలలో కళారామరాజ్యం పాలన!

ఓ బాపూ! తెలుగు తల్లి కడుపున పుట్టిన త్యాగయ్య, పోతన, దీటున రాణించి...
ఆరోగ్యంగా, ఆనందంగా, వెయ్యేళ్ళు జీవించాలని ఆశించే
'హాస్యానందం' జన్మదిన శుభాకాంక్షలు అందుకోండి!

-కె.వి.భీమారావు, హైదరాబాద్

ఆ టాపిక్! -ఈ కార్టూన్

కార్టూన్‌కి భావం ప్రధానం. ఆ భావం స్ఫురించడానికి పొందికైన వ్యాఖ్య మరింత ముఖ్యం. తక్కువ మాటలతో గుండ్రటి అక్షరాలతో వ్యాఖ్య రాస్తే, అదే కార్టూనుకు అందం.



కార్టూన్‌కి బొమ్మ ఎంతమేరకు అవసరమో, ఆ మాత్రం వుంటే చాలు. వ్యాఖ్యకు సరిపడా, బొమ్మ (ఆ కార్టూను వరకూ కార్టూనిస్టు చిత్రకారుడిగా కాక ఆ పరిధిలో) గీస్తే చాలు. కార్టూన్‌లో పర్‌స్పెక్టివ్ వేలా, హంగులూ, జిలుగులూ, తాటికాయలు వగైరా అవసరమనుకుంటే గీయవచ్చు. అది ఆయా కార్టూనిస్టు టేస్టుకీ, నైపుణ్యానికీ సంబంధించినది మాత్రమే.

ప్రపంచకార్టూనిస్టుల లిస్టు సముద్రమంత పెద్దది. వాళ్ళు గీసినవి, గీస్తున్నవి, కార్టూన్లను పరిశీలిస్తే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఒక చివర పిచ్చిగీతల్లాగా కనిపిస్తాయి. మరో చివర గొప్ప పెయింటింగుల్లా దర్శనమిస్తాయి. అన్నీ కార్టూనులే.

ఇది కార్టూను అని నిర్ధారించి ఒక కార్టూనిస్టు పేపరుమీద కంప్యూటరు మీద గీస్తే.. అది కార్టూనే. దాన్ని ఎడిట్ చేసే హక్కు ఎవరికీ లేదు కదా, సాధ్యం కూడా కాదు. అదీ కార్టూన్ యొక్క విశిష్టత.

నాకొక ఐడియా తట్టి, దాన్ని గీసి, పత్రికకు పంపించి, అది సంపాదకుడి చేత అంగీకరించబడి ప్రచురితమైతే... అంటే... జాబ్ ఈజ్ డన్. నేనూహించినంతగా పాఠకులు మెచ్చుకోకపోవచ్చు. అది వేరే విషయం. మరో కార్టూనిస్టుకు అది కొత్తగా నచ్చకపోవచ్చునేమో కూడా. అది నేను లెక్కచేసుకున్నట్లుంటే నా బుర్రలో ఐడియాలు తట్టడం ఆగి పోతాయి. మరి పోటీని కొనసాగించేదెలా?

ప్రతి కార్టూనిస్టూ (ముఖ్యంగా యువ కార్టూనిస్టులు) ఎల్లవేళలా కార్టూన్ ఐడియాలు ఆలోచిస్తూ వుండాలి. బుర్రని పదును పెడుతూనే వుండాలి. కార్టూన్లు గీస్తూనే వుండాలి... వాళ్ళ వాళ్ళ స్టైల్లో... అంతే! ఇంప్రూవ్‌మెంటు తనంతటదే వస్తుంది. కొందరికి ఫాస్టుగా... మరి కొందరికి స్లోగా!

గీతల్లో కితకితలోళ్ళు...

శంకర్ పిళ్లై!!

కత్తిలాంటి కార్టూన్లు గీశాడు...
రాజకీయ అవినీతి తిత్తి తీశాడు!
ఎంతటోడినైన కార్టూన్ వేసి గిల్లై...
అని అంటాడు మన శంకర్ పిళ్లై!!



గీ: శంకర్ నారాయణ ♦ రా: బి.ఎమ్.పి.సింగ్

రీ సౌండ్.....

హాస్యానందం మతి మరపు సంచిక గుర్తుపెట్టుకునేలా రూపొం దించిన మీకు మా అభినందనలు. ఒకో సబ్జెక్ట్ మీద ఒకో సంచిక రూపొందిస్తున్న మీ అభిరుచికి హ్యాట్సాఫ్! -శ్రీహరి.ఎస్., కొత్తగూడెం

నవంబర్ 12 మతిమరపు స్పెషల్ హాస్యానందం సంచిక చాలా బాగుంది. మతిమరపులో ఇన్ని రకాలుంటాయని ఈ సంచికలోని కార్టూన్లు, కథల ద్వారా తెల్సింది. మరచిపోకుండా ఇంతమంది కార్టూనిస్ట్ మిత్రులు తమ ఐడియాలను సంధించడం చాలా చాలా బాగుంది. ఇలా ప్రతినెలా ఏ స్పెషల్‌తో సంచిక తేవాలా అనే టెన్షన్ రాముగారికి. ఎంత స్పెషల్‌గా పంపాలా అనే టెన్షన్ కార్టూనిస్ట్‌లకి, రచయితలకి అలవాటయిపోయింది. అన్నట్టు మరచిపోకుండా రాస్తున్నా కార్టూన్ ఉత్సవ్ 2012 విశేషాలు, ఫొటోలు చాలా చాలా బావున్నాయి.

-పొన్నంది వెంకటరామశర్మ, విశాఖపట్టణం

హాస్యానందం నవంబర్ సంచిక మతిమరపులతో కళకళలాడింది. మతిమరపుని విస్తరింపజేసిన హాస్యానందంకి నా అభినందనలు.

-కె.అనూరాధ, రాజమండ్రి

నవంబర్ హాస్యానందం సంచికలో ప్రచురించిన కథలు చాలా బావున్నాయి. ముఖచిత్రం నుండే మతిమరపుని మరచిపోకుండా ఎస్టాబ్లిష్ చేసిన ఎడిటర్‌గారు అభినందనీయులు. ఒకే కథకు బొమ్మ మరచిపోయినా... రెండు కార్టూన్లు రిపీటయినా... ఇవన్నీ మతిమరపు విన్యాసాలుగానే రూపొందించారని కనిపెట్టేసిన నేను కూడా గ్రేటే కదా! ఏదీ ఏమైనా... మీ ప్రయత్నం సఫలీకృతమయిందనే నేను భావిస్తున్నాను.

-ఎ.గోపాలరావు, నెల్లూరు

మతి మరపు మహాశయులకు నా అభివాదములు. ఎక్కువ పనులు పెట్టుకుంటే ఎక్కువసార్లు మరచిపోతారనే కొత్త విషయం నవంబర్ హాస్యానందంలో నేను తెలుసుకున్నాను. మతిమరపు గురించి ఎన్ని వ్యంగ్యాలు... ఎన్ని కోణాలు... ఎన్నినవ్వులు! స్పెషల్ సంచిక అదిరింది!

-డి.లలితారాణి,గుంటూరు

హాస్యానందం నవంబర్ సంచిక చాలా బాగుంది. మన కార్టూనిస్ట్‌ల ఆలోచనలకు అద్దంపట్టేట్టున్నాయి కార్టూన్లు. ఒక్క సంచికలో ఎన్ని కార్టూన్లు! ఓహ్! ఒక తెలుగు పత్రికలో ఒక సంచికలో సుమారు 70 కార్టూన్లంటే మాటలా! అలాగే ఒకో సంచికలో ఒకో కార్టూనిస్ట్‌ల పరిచయాలు కూడా ప్రచురించగలరు. -పి.శ్రీనివాస్,తణుకు

వ్యాపకాలు ఎక్కువైన కొద్దీ మనిషికి జ్ఞాపకాలు తగ్గిపోతాయి- అన్న శ్రీపి.ఎస్.పి.సింగ్‌గారి అభిప్రాయంతో నేను నూరుశాతం ఏకీ భవిస్తాను. మతిమరపు ఒకోసారి వరమైతే... ఒకోసారి శాపం. ఏదే మైనా మతిమరపుని సంపూర్ణంగా హాస్యాభిషేకం చేసిన హాస్యానందానికి నా అభినందనలు. -కె.వరప్రసాద్,హైదరాబాద్



మల్లిక్ కామెడీ కథలు

మా భక్తి వినరండహో

అద్దంలో దీక్షగా మొహం చూస్కుంటూ షేవ్ చేస్కుంటున్న వెంకట రత్నం ఒక్కసారిగా ఉలిక్కిపడి కుర్చీలోంచి అరంగుళాలు ఎగిరి పడ్డాడు.

అట్లా ఎగిరిపడ్డం వల్ల అతని చెంపమీద కూసింత రేజర్ గాటు పడింది.

"హాయమ్మోవ్..." అన్నాడు చెంప రుద్దుకుంటూ వెంకటరత్నం.

అతనలా ఎగిరపడ్డానికి కారణం హఠాత్తుగా పెద్ద శబ్దం రావడమే.

ఆ శబ్దం మైకులోంచి పాట రూపంలో వస్తాంది... గాఠిగా...

"ఓ దేవా...?
జోవగ రావా?...
భక్తజన రక్షకా...
కావగ రావా...
మమ్మేలగ రావా...
హరహర శంకర మహాదేవా
భక్త జనాలకు భళిదేవా (ఇది కోరస్)"

ఒక్కసారిగా జనంగా భక్తి ఇంత పెద్ద శబ్దంతో పెల్లుబుకుతుందేంటబ్బా? అని ఆశ్చర్యం తో ముక్కున వేలేస్కున్నాడు వెంకటరత్నం.

కానీ అక్కడే పెద్ద పొరపాటు జరిగి పోయింది.

అతను ముక్కున వేలేస్కున్నాడు అని అను కున్నాడు గానీ... వేస్కున్నది వేలు కాదు... గెడ్డం చేస్కుంటున్న రేజర్!

అంతే... కసక్...

"హమ్మో!..." ముక్కు తడుముకున్నాడు వెంకటరత్నం.

చేతికి రక్తం అంటుకుంది.

సరిగ్గా అప్పుడే మైకులోంచి పాట ఆగి పోయి నిశ్శబ్దంగా మారింది వాతావరణం.

"హమ్మయ్య!..." అనుకుని రేజర్‌తో చెంప మీద రెండుసార్లు గీక్కున్నాడు.

ఇంతలో మళ్ళీ ఘోరం జరిగిపోయింది.



మైకులో పెద్ద సౌండుతో ఇంకోపాట మొదలైంది.

ఆ సౌండుకి మళ్ళీ ఉలిక్కిపడ్డాడు వెంకట రత్నం.

ఫలితం?

కసక్...

ఈసారి ఎడమచెంపమీద గాటుపడింది.

మళ్ళీ కెరక్... బెరక్... అన్నాడు వెంకట రత్నం ఎడమచెంపని తడుముకుంటూ.

మైకులో పాట యమజోరుగా వస్తాంది.

"రారండీ భక్తులారా
రంగరంగ వైభోగాన
శివ దేవుని కొలవండీ"
చెక్క భజన చేయండి...

"హా!..." మూల్గుతూ రేజర్‌ని మెడమీద పెట్టాడు వెంకటరత్నం.

కానీ అప్పుడే ఎవరో భుజంమీద దభీమని చరిచారు.

హంతే... ఆ కుదుపుకి మళ్ళీ మెడమీద కసక్...

"హాయమ్మోవ్..." గట్టిగా అరిచాడు వెంకట రత్నం.

ఓసారి మెడని బాధగా తడుముకుని తనకు ఏర్పడిన కుదుపునకు కారణం ఏమిటా అని పక్కకి తిరిగి చూశాడు.

పక్కనే కాఫీ కప్పు పట్టుకుని భార్య కాంతామణి నిల్చొని వుంది.

"గెడ్డం గీస్కునేప్పుడు ఇలా సరసాలాడొద్దని చెప్పానా?" పళ్ళు కొరుకుతూ అన్నాడు వెంకటరత్నం.

"సరసమూ నా బొందా?.. ఇందాకట్నుండీ పిలుస్తుంటే పలకరేం?... కాఫీ తీస్కోండి..." అంది ఆమె అతనికంటే ఎక్కువగా పళ్ళు కొరుకుతూ.


"అసలు నువ్వు పిలిచింది ఈ మైకుగోలలో వినిపిస్తేగా? ఆ కాఫీ అక్కడ తగలెయ్!!..." అన్నాడు విసుక్కుంటూ.

కాంతామణి కాఫీ అక్కడ పెట్టేసి వెళ్ళి పోయింది.

వెంకటరత్నం ఓసారి దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ అద్దంలో తన మొహం చూస్కుంటూ గెడ్డం గీస్కోడానికి ఉపక్రమించాడు.

మైకులో గోలగోలగా మరోభక్తి పాట

చేస్తొంది.
"భం భం భం భోళె దేవా...
నీ భజన సేతము భోళె దేవా..."
ఆ గోలకీ... ఆ శబ్దానికీ వెంకటరత్నంకి ఏదో కంగారుగా... అదేదో గాభరాగా అనిపించింది. కాస్త పిచ్చిపిచ్చిగా అనిపించింది.
ఫలితం... మరోసారి కసక్...
"వామ్మోవ్..." గెడ్డం తడుముకుని చేతికి అంటిన రక్తం చూసి ఘొల్లుమన్నాడు వెంకటరత్నం.
మరుక్షణం ఇంట్లోంచి వెంకటరత్నం కూతురు సుబ్బలక్ష్మి కూడా గొల్లుమంది.
"నువ్వెందుకే ఘొల్లుమంటున్నావ్? నీ గెడ్డం కూడా తెగిందా?" ఇంట్లోకి చూస్తూ అరిచాడు వెంకటరత్నం.
కానీ మరుక్షణం తన తప్పును గ్రహించి నాలుక కొరుక్కున్నాడు.
ఆడాళ్ళకి గెడ్డం వుండదు కదా... హారి!
"నాన్నా... త్వరగా రా నాన్నా..." గోడు గోడున అంది సుబ్బలక్ష్మి.
వెంకటరత్నం కంగారుగా లోపలికి పరిగెత్తాడు. అక్కడి దృశ్యం చూసి నిరుత్తరుడై పోయాడు వెంకటరత్నం.
కాంతామణి మంచంమీద పడుకుని వుంది జబ్బు మనిషిలా. ఆమె ఆయాసపడుతూ ఎగశ్వాస పీలుస్తోంది. ఆమె కాళ్ళదగ్గర పదారేళ్ళ సుబ్బలక్ష్మి కూర్చుని వుంది.
"ఏమైందే... ఇప్పటిదాకా బాగానే వున్నావ్ కదా?" కంగారుగా అడిగాడు వెంకటరత్నం.
"ఏమైందేమిటండీ... నేనసలే బి.పి. పేషెంటుని కదా?... ఆ మైకుగోలకి నాకు గందరగోళం అయిపోయి... గుండెల్లో గాభరా అయిపోయి ఇలా మంచంమీద పడిపోయా...ఇహ ఈవాళ్టికి వంటా గింటా లేదు... మీరే వంట చేస్కోండీ..." అంది కాంతామణి రొప్పుతూ.
వెంకటరత్నం గుండెలు బాదుకుని లబ్బున మొత్తుకున్నాడు.
కాంతామణి ప్రేమగా చూసింది.
"అహ్?... నేనంటే మీకెంత ప్రేమండీ... నాకు చిన్న కష్టం రాగానే.. మీరెట్టా లబ్బు లబ్బున మొత్తుకుంటున్నారో!!" అంది ఆనంద భాష్పాలు రాలుస్తూ.
"ఛాల్లే ఊర్కో... ఇప్పుడు వంట మొదలెట్టే



నేనాఫీసుకు ఎట్టా వెళ్ళాల్రా నాయనా అని నేను గోలెడ్తుంటే, నీ సోది ఒకటి...!" విసుక్కున్నాడు వెంకటరత్నం.
ఇంతలో పక్కగదిలోంచి వెంకటరత్నం పన్నెండేళ్ళ కొడుకు నారాయణ-

"నాన్నోయ్..." అంటూ ఘొల్లుమన్నాడు.
వెంకటరత్నం కంగారుగా ఆ గదిలోకి పరుగెత్తాడు.
అక్కడ... అతని తండ్రి వెంకట్రామయ్య మంచం మీద పడుకుని.. రెండు చేతులూ గుండెమీద పెట్టుకుని విలవిల్లాడుతూ చూస్తున్నాడు.
"ఏమైంది నాన్నా?" తండ్రిని ఆందోళనగా అడిగాడు వెంకటరత్నం.
"ఇంకేం కావాల్రా నాయనా...నీకు తెల్సు కదా... నేను హార్ట్ పేషెంట్‌ననీ... ఈ మైకు గోలకి నాకు హార్ట్ ఎటాక్ వచ్చేలా వుందిరా... ఈ మైకు కట్టేసేలోగా నేను పోతానో ఏంటో!" అన్నాడు వెంకట్రామయ్య.
"అట్టాగయితే లాయర్‌ని తీసుకురానా నాన్నా విల్లు గురించి చెప్పొద్దూ..."
అది వింటూనే వెంకట్రామయ్య మండి పడ్డాడు.
"లాయర్ సంగతి తర్వాత... ముందు ఆ భక్త సమాజం వాళ్ళ దగ్గరికెళ్ళి వాళ్ళతో మాట్లాడి ఆ మైకు సౌండు తగ్గించేలా చెయ్... అబ్బా... హమ్మా..." గుండెలమీద చేత్తో రుద్దు కున్నాడు వెంకట్రామయ్య.
వెంకటరత్నం వెంటనే బయటికి పరిగెత్తి భక్తసమాజం దగ్గరికి వెళ్ళాడు.
కాలనీలోని భక్తులంతా... చిలకాకుపచ్చ చొక్కాలు ధరించి హడావిడిగా తిరిగేస్తున్నారు అక్కడ.
వాళ్ళంతా భోళె దేవుడి భక్తులు.

దీక్షలో ఉన్నప్పుడు వాళ్ళు అలా వచ్చిపోతారని భరిస్తారు.

"సార్... సార్! అర్జంట్.. ఇక్కడ మీ భక్త సమాజం సెక్రెటరీ ఎవరు సార్?.." ఓకాయన్ని హడావిడిగా అడిగాడు వెంకటరత్నం.

"నేనే... ఏం!" ఆ పక్కనే వున్న ఒకాయన మీసాలు దువ్వుతూ ముందుకు వచ్చాడు.

"ఏం లేదు సార్...మా ఇంట్లో మా ఆవిడకి బి.పి....మా నాన్నగారు హార్ట్ పేషెంట్ సార్..."

"అయితే...?"

"మీరు మైక్ తీసేసి భక్తిపాటలు వేస్కోవచ్చు కదా సార్?"

"నువ్వేం మనిషివయ్యా! భక్తిపాటలు వద్దంటావేమిటి?... మనిషికి అంతో ఇంతో పాప భీతి, భక్తీ వుండాలయ్యా...ఇలా అనడం చాలా తప్పు. చెంపలేస్కో లేకపోతే కళ్ళు పోతాయ్" అన్నాడు సెక్రెటరీ సీరియస్‌గా.

వెంకటరత్నం నాలుక కొరుక్కుని చెంపలేస్కున్నాడు.

"నిజమేగానీ సార్! పోనీ మైకుసౌండు తగ్గించు కోవచ్చు కదా సార్... ఇంత గందరగోళంగా లేకుండా... హీ... హీ...!! హీ...!!!"

"భలేవాడివే! మైకు సౌండు తగ్గిస్తే కాలనీ మొత్తం వినిపించదు. అలా వినిపించకపోతే కాలనీజనాలకి మాకు భక్తి వుందని ఎలా తెలుస్తుంది?"

"నువ్వు దేవుడికీ, మతానికీ విరుద్ధం లాగున్నావే?" అన్నాడు సెక్రెటరీ పళ్ళునూరి.



"అది కాదు సార్... నేను ఏ దేవుడికీ ఏ మతానికీ విరుద్ధం కాదు సార్... ఏ మతం వాళ్ళకైనా మనసులో భక్తిభావం ముఖ్యంగానీ... మనలకి భక్తి వున్నట్టు ఇలా బయటికి ప్రదర్శించవలసిన అవసరం లేదు కదా సార్... దానివల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిం..." స్పీచ్ ఇవ్వబోతున్న వెంకటరత్నాన్ని మధ్యలోనే చిటికెలు కొట్టి వెళ్ళిపోయాడు సెక్రెటరీ.

వెంకటరత్నం దీనముఖం వేసి "ఇంతా ఈ మైకు ఎంతదాకా వుంచుతారు?" అని అడిగాడు అక్కడ వున్న రెండో వ్యక్తిని.

"ఈ రోజంతా వుంటుంది... అంతేకాదు. రాత్రి భక్తులమంతా కళ్ళు గోలగోలగా భజన కూడా చేస్తాం ఎంచక్కా.." నవ్వుతూ సమాధానం చెప్పాడు అతను.

"భజన కూడా మైకు పెట్టుకుని చేస్తారా?!"

"ఓ... ఫస్ట్‌గా!" అన్నాడు అతను.

వెంకటరత్నం గుండెలు బాదుకున్నాడు.

ఆ రోజు వంట చేస్కుని ఆఫీసుకెళ్ళేసరికి బాగా ఆలస్యం అయ్యింది. ఆఫీసరుతో బాగా చివాట్లు తిన్నాడు. సాయంత్రం ఇంటికొచ్చాక మళ్ళీ వంటపని!

"మైకుందిగా?... పరీక్షలున్నా మేం చదవనే చదవం!" అంటూ పకపకా నవ్వారు పిల్లలు.

ఆ రోజు రాత్రి తొమ్మిదికి భజన మొదలైంది. మైకు సౌండ్ ఫుల్‌గా పెట్టి ఒక తాళ్ళ మంది దాకా భజన చేశారేమో... కాలనీ జనం మొత్తం పిచ్చెక్కి జుట్టు పీకేస్కున్నారు.

దాదాపు రాత్రి పన్నెండుదాకా ఆ భజన కార్యక్రమం కొనసాగింది.

తర్వాత నిశ్శబ్దం.


"హమ్మయ్య... మైకు గోల తప్పింది" అని తేలిగ్గా ఊపిరి పీల్చుకుని నిద్రపోదామని పక్క పడ్డాడు వెంకటరత్నం.

కానీ... మర్నాడు తమ తరఫున మైకుపెట్టి భజన కార్యక్రమం నిర్వహించాలని అదే కాలనీలో వేరే భక్త సమాజం వాళ్ళు నిర్ణయం తీసుకున్నారని పాపం వెంకటరత్నానికి తెలీదు... కాలనీవాసులకీ తెలీదు.



డిసెంబర్ 31... సరదాలు





నాకేం తెలీదు...! నాకేం తెలీదు...!!

పార్నంది వెంకట రామశర్మ

సుతిమెత్తగా లక్ష్మీదేవి పాదాలొత్తుతుండడంతో మెల్ల మెల్లగా నిద్రలోకి జారుకున్నారు పాలకడలిలోని శ్రీమహావిష్ణువు.

ప్రక్కనున్న పార్వతీదేవి ఏదో ముచ్చట్లు చెప్తుండగా వింటూ వింటూ... యథాప్రకారం అర్ధనిమీలితనేత్రుడై ధ్యానంలోకి వెళ్ళిపోయాడు పరమశివుడు.

వాణీ వీణానాదం వీనులవిందుగా వినిపిస్తుండగా సృష్టి చేసి, చేసి అలసిన బ్రహ్మ నాలుగు తలలూ కాస్తంత సేద తీరుతున్నాయన్నట్టుగా... నిద్రాయోగంలోకి వెళ్ళిపోయాయి.

అదిగో, అలాంటి సమయం కొంత గడిచేసరికి, వారి ముగ్గురి నాసికా పుటలకి... ఇది వరకు తెలియని ఏదో వింత సువాసన సోకి.. ఎవరి లోకంలో వారు హాయిగా పోతున్న నిద్రలోంచి వాళ్ళ లోకాలలోకే మళ్ళీ వచ్చిపడ్డారు.

విష్ణుమూర్తి కళ్ళు తెరిచి చూసేసరికి పాదాల చెంత లక్ష్మీదేవి లేదు. శివుని ప్రక్కన పార్వతి కూడా లేదు. బ్రహ్మ నాలుగు తలలూ ఒకేసారి నాలుగు దిక్కులూ చూసినా సరస్వతి జాడ లేదు.


"ఏమయ్యారు వీళ్ళు? అయినా ఏమిటి ఈ వింతవాసన? చాలా హాయిగా నాసికలను తాకుతోంది? ఏమయి వుండునో...?" అనుకుంటూ ఎవరికి వారే వారి భార్యలను వెతకసాగారు.

విష్ణువుకి తమ ఏకాంత మందిరంలో లక్ష్మీదేవి ఏదో చేస్తూ కనబడింది.

పార్వతీదేవి కూడా కైలాస శిఖరాన, అంత మంచులోనూ... అల్లంతదూరాన అటుతిరిగి ఏదో వేడిమి కలిగిస్తూ శివుని కంటబడింది.

సరస్వతీదేవి కూడా అంతే! బ్రహ్మ చూడకుండా వదిలేసిన ఆగ్నేయదిక్కుగా అటుతిరిగి ఏదో చేస్తూ కనబడింది.

ఉండబట్టలేక ఎవరికి వారు వారి భార్యలని సమీపించారు.



"ఏమిటిది దేవీ? ఈ విచిత్ర చర్య? ఇవన్నియూ ఏమి? ఇదివరకెప్పుడూ ఇంత శ్రమపడి యెరుగవు కదా? ఈ వింత సువాసన ఇచట నుండే వచ్చుచున్నట్టుగా తోచుచున్నది. ఏమున్దేశించి ఈ పనులు చేయుచున్నావు?" ఇంచుమించు ఇదే అర్థం వచ్చేలా వాళ్ళు ముగ్గురూ వారి భార్యలను అడిగారు.

(ఇక ఇక్కడినుండి... ఏ సంభాషణ అయినా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర లోకాల్లో ఒకేసారి జరిగినట్టుగా అనుకోండి.)

"ఇవి ఒక వింతైన, చక్కని వంటకములు నాథా!" అన్నారు పా(ర్వతి)... ల(క్ష్మి)... స(రస్వతి)లు.

"వంటకములా? ఇది ఏమి! ఇవి మానవుల పని కదా? మనకేల యీ గోల? హాయిగా అమృతముండగా?" అని వి(ష్ణు),బ్ర(హ్మ), మ(హేశ్వరు)లు అన్నారు.

"ఆ అమృతము గ్రోలి విసుగు వచ్చుచున్నది. అదే రుచి... అంతే వేడిమి... ఇదిగో... ఈ వంటకము రుచి చూడుడు... దీనిని గుత్తి వంకాయ కూర అందురు. ఇదిగో ఇది పాయసము. మన అమృతము కన్న గొప్పరుచి గలది. ఇక ఇది..." ఇలా తాము చేసిన వంటకాల వివరాలు వివరించారు.

ఇక నోరూరడంతో వాటిని కాస్తంత రుచి చూసి "ఆహా! అద్భుతము! మానవులు ఎప్పుడూ మొక్కుబడిగా పెట్టే పళ్ళు, పాలవంటి నైవేద్యములకన్న బహురుచిగా వున్నవి. అంతకీ వీటిని చేయవలనన్న ఊహ నీకెటుల వచ్చినది?" అంటూ అక్కడున్న వస్తువులను చూసి... "అహా! ఇది ఏమి! ఎర్రగా బరువుగా ఒక బండవలె నున్నది? అరెరే! ఈ గిన్నెపై అగ్ని అచటకెటుల వచ్చినది?" అని ఉత్సుకతతో అడిగారు విభులు.

"ఇవి యేమియు మీకు తెలియనటుల మాటలాడకండి. మీ మటుకు మీరు హాయిగా నిద్రపోయే సమయంలో ఏమీ తోచక, మా లక్ష్మి, పార్వతి, సరస్వతులము ఊసులాడుకొనుట అలవాటయినది. ఈ రోజున మా మాటలలో ఒక ప్రత్యేకమయిన విషయము చర్చకు వచ్చి, ఈ కార్యక్రమము చేపట్టితిమి. ఇక, ఇది నిజముగా ఒక బండే. దీనిని భూలోకమున 'గేస్ బండ' అని, 'గేస్ సిలెండర్' అని అందురు.

దీని ద్వారా వచ్చిన వాయువు. ఇదిగో 'స్టవ్' అని మానవులు పిలుచు దీనిద్వారా ఇటుల నీలి మంటలో మండుట వలన ఆ వేడిమికి ఈ వంటకాలు చేసితిమి. ఈ వంటకములన్నియు, ఈ దినము ఒకే సమయమున మీ త్రిమూర్తులు ఆరగించబోవుచున్నారు" అని త్రిమూర్తులకు సగము సందేహ నివృత్తి చేశారు పా.ల.స.లు.

"కాని ఇవన్నియూ మీకెటులా వచ్చినవి" పూర్తి సందేహ నివృత్తికై అడిగారు వారు.

ఇంక పతిదేవుల విస్మయ సందేహాలని సంపూర్ణంగా నివృత్తి చేద్దామని..

"వినుడు నాథా! గత కొన్ని నాళ్లుగా భూలోకమున అనేక వస్తువుల ధరలు పెరిగి, పెరిగి, పెరిగి మెల్లగా మెల్లగా నింగిని తాకి, ఆపై... గ్రహారాశులధిగమించి, ఘనతారల పథమునుండి... గగనాంతర రోదసిలో... గంధర్వ గోళ గతులదాటి... చంద్రలోక మైన, దేవేంద్ర లోకమైనా..." అని భూలోకమున ఒక మహాకవి అద్భుత వ్రాసినట్లు...
ఈ వస్తువులన్నియు మన లోకముదాకా వచ్చినవి. ముఖ్యముగా ఈ గేస్‌బండ అన్నిటి బహు త్వరగా మన లోకము చేరినది.
ఇది మానవులకు అత్యంత అవసరమైనది. ఇది లేని మానవ జీవితము బహు దుర్భరము. ఇది ఇప్పుడు సామాన్య మానవునకి గేస్‌బండగా కాక.. 'గుదిబండ'గా మారినది.
ఆ తీరునే మానవుని ఇతర నిత్యావసరవస్తువులు, కూరగాయలు క్రమ క్రమేణా... మనలోకానికి అందుబాటులోనికి వచ్చినవి. అదిగో... అలా అందివచ్చిన వాటితో ఈ వంటకాలు చేసి మిమ్మలను ఆశ్చర్యానంద చకితులను చేద్దామని మేము ముగ్గురము ఈ రోజు అనుకుంటిమి, అది కాక ఇంకొక ప్రబల కారణమున్నది" అని ఆపారు వారి వివరణని.

"ఏమది! త్వరగా తెలుపుము" తొందర పెట్టారు త్రిమూర్తులు.

"ఎప్పుడూ తిని కూకుంటే మనిసికీ, గొడ్డుకీ తేడా ఏటుంటాది? మడిసన్నాక కాస్తంత కలాపోసన వుండాలి" అని ప్రవచించిన ముళ్ళపూడి వెంకట రమణగారు మన చెంతనే వున్నారు కదా! ఆయన మనల్ని చూసి "ఎప్పుడూ తాగి(అమృతం) కూకుంటే, దేవుడికీ, మనిసికీ తేడా ఏటుంటాది! దేవుడన్నాక కాస్తంత కళలిక వుండాలి" అని వెక్కిరించినట్లనిపించింది. అందుకే ఈ ప్రయత్నం" అని వివరించారు.

ఇంకాస్త వంటకాలని వారికి రుచి చూపిస్తూ "ఓహో! బాగుగు! బాగుగు! కాని అక్కడ మానవుల పరిస్థితి? ఒకసారి పరికించెదము గాక!" అని భూలోకము వైపు దృష్టి సారించారు త్రిమూర్తులు.

* * *



మానవులు! పాపం! ఏం చెయ్యాలో తోచక జుత్తు పీక్కుంటున్నారు. ఎక్కువమంది భూలోకపు 'అమృతం'గా భావించే ప్రభుత్వము సారాని పొట్టనిండుగా నింపుకొని.. ఇహలోక బాధలను మర్చిపోసాగారు.

దమ్మీర్లు (పకీర్లకి వికృతి... అదేగా దమ్మున్నోళ్ళు)ని మాకిదేం లెక్క కాదన్నట్లు ఎప్పటి లాగే నిర్లక్ష్యంగా వున్నారు.

ఏటుకీ చెందని వారు అప్పు కోసం బేంకులంటూ, ఫైనాన్స్ కంపెనీలంటూ పడసాగారు.

పోనీ, కట్టెపుల్లన్నా ఏరుకొచ్చి పూర్వకాలంలా కట్టెలపొయ్యి వెలిగించుకుందామంటే... అసలు అడవులే లేని కాంక్రీటు అడవుల్లో ఏం చెయ్యాలో తోచక తల, పొట్ట రెండుచేతులా పట్టుకున్నారు.

పాలకులు మాత్రం... మళ్ళీ కొత్తగా ఇంకేమేం వస్తువుల ధరలు పెంచుదామని రోజూ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఎవరో "దేవుడా! ఏమిటీ అధిక ధరలు! మాకేది దారి!" అని గట్టిగా అరుస్తుండడంతో ఆ దేవుళ్ళు ఉలిక్కిపడి బ్రహ్మానందంలా "నాకేం తెలీదు... నాకేం తెలీదు మానవా! నన్నిందులోకి లాగకు!" అని తమ భార్యలవైపు తిరిగారు ఆ కొత్తవంటలనే రోజూ చెయ్యమని అభ్యర్థించడానికి.



"అవునవును. ఇవ్వాళ మూడోరోజు గదా! మూడోరోజున్నా మనం ఒక్కటవ్వకపోతే మూడు రాత్రులన్నమాటకే అర్థం వుండదసలు... కమాన్ డార్లింగ్..." అన్నాడు చిట్టిబాబు ఉత్సాహంగా చేతులు చాస్తూ....

శోభనాత్రం అతనికి ఎంతగా ఉందో ఆమెకీ అంతగానే వున్నమాట వాస్తవం కాబట్టి, అతనలా చేతులు చాచగానే గువ్వపిట్టలా అతని కౌగిట్లో ఒదిగిపోయింది రుద్రమ.

'అబ్బ ఎంత హాయిగా వుంది!' అనుకున్నాడు చిట్టిబాబు. ఆమెను మరింత, గట్టిగా కౌగిలించుకుంటూ.

ఆ బిగికౌగిట్లో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతూ 'అబ్బ! ఎంత హాయిగా వుంది!' అని తను కూడా అనుకుని అంతలోనే 'మరీ ఇంత మొరటుతనం ఏంటబ్బా?' అని కూడా అనుకుంది రుద్రమ.

అది గ్రహించి తన కౌగిల్ని కాస్త సడలించి

"సారీ రుద్రా! శోభనాత్రం ఆపుకోలేక కాస్త గట్టిగా కౌగిలించుకున్నాను. అంతేగానీ, నేనేం మొరటు వాడిని కాను. ఎనీ హౌ అయామ్ వెరీ వెరీ సారీ..." అన్నాడు చిట్టిబాబు.

"ఫర్లేదు!" అంది రుద్రమ.

మనసులో ఏ ఆలోచనా రానివ్వకుండా అతి కష్టంమీద నిగ్రహించుకుంటూ.

"అయితే మళ్ళీ ఇందాకట్లా గట్టిగా కౌగిలించుకోనా?" మరింత ఆశగా చూస్తూ అడిగాడు చిట్టిబాబు.

"మీ ఇష్టం!" అంది రుద్రమ.

మనసులో ఏ ఆలోచనా రానివ్వకుండా మళ్ళీ అతి కష్టం మీద నిగ్రహించుకుంటూ.

> **జరిగిన కథ:** బస్టాప్‌లో బస్ కోసం ఎదురు చూస్తుండగా ఒక అందమైన అమ్మాయి చిట్టిబాబుని చూసి నవ్వుతుంది. ఆమె ఎందుకు నవ్వుతుందో అర్థం కాక ఎదుటి వాళ్ళ మనసులో అనుకున్నది తెలిస్తే ఎంతబాగుంటుందో అనుకుంటాడు. అలా అనుకోగానే ఎదుటివాళ్ళు అనుకుంటున్నవన్నీ చిట్టిబాబుకి తెలిసి పోతుంటాయి. తన చెల్లెలు పక్కింటి కుర్రాణ్ణి ప్రేమిస్తున్నట్టు తెలిసి, వాళ్ళిద్దరి పెళ్ళిగురించి పెద్దలతో మాట్లాడి ఒప్పిస్తాడు. బస్టాప్‌లో కనిపించిన అమ్మాయితో చిట్టిబాబు పెళ్ళి జరుగుతుంది. అయితే మొదటిరాత్రి ఆ అమ్మాయి మనసులో అనుకుంటుందంతా తెలిసి చాలా బాధపడ్డాడు చిట్టిబాబు. —ఇకచదవండి

దాంతో రెట్టించిన ఉత్సాహంతో ఆమెను మళ్ళీ గట్టిగా కౌగిలించుకున్నాడు చిట్టిబాబు.

"ఎర్రటి నీ పెదవుల్ని చూస్తుంటే నాకు నోరూరేలా వుంది. నేను వీటిని ముద్దుపెట్టుకోవచ్చా?" అడిగాడు కౌగిలించుకున్నాక.

అలాంటి సమయంలో అలా ప్రతిదానికీ భార్య పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరం లేదని అతనికేం తెలుసు?

అదే తొలి అనుభవం గదా!

అందుకే అమాయకంగా అలా అడిగాడతను.

"నిరభ్యంతరంగా పెట్టుకోవచ్చు" అని ఎలా చెప్పగలుగుతుందామె.

అందుకే 'ఛీ! ఏం మనిషి బాబూ!... ఎలా అడుగుతున్నాడో సిగ్గులేకుండా' అనేసుకుంది మనసులో.

తీరా అనేసుకున్నాక తను తప్పేంటో అర్థమైందామెకి.

కానీ, ఏంలాభం? అప్పటికే లేటయిపోయింది. అప్పటికే చిట్టిబాబు ఆమె మనసులో అనుకున్న మాటలకి రియాక్టయిపోయాడు.

'ఎందుకు రుద్రా. అప్పిటికీ అలా తప్పుగా అర్థం చేసుకుంటావు నన్ను? ఇందులో సిగ్గు లేకపోవడం ఏముంది? నీ పెదాల్ని ముద్దాడబోయి పర్మిషన్ అడిగాను. అదీ తప్పేనా?" అన్నాడు బాధగా.

బాధగా అంటే మరీ బాధగా కాదు. కొంచెం బాధగా.

అతని అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు రుద్రమకి.

"నేను మీ భార్యనండీ...నా మీద మీకు సర్వ హక్కులూ వున్నాయ్. నన్ను మీరు ఏమైనా చేసుకోవచ్చు. ప్రతిదానికీ ఇలా పర్మిషన్ అడగాల్సిన పనిలేదు..." అంది చిలిపిగా తల దించుకుంటూ. మనసులో ఏదో అనుకోబోయి, నిగ్రహించుకుంది ఎలాగో!

ఆమె మాటలు ఇచ్చినంత ధైర్యాన్నివ్వగా ఆమెను మంచంమీదకు వాల్చేస్తూ, తన పెదవులతో ఆమె పెదవులను అందుకున్నాడు చిట్టిబాబు.

ఇద్దరికీ తొలిముద్దే గదా! తియ్యగా వుండక వస్తుందా? ఆ మాధుర్యాన్ని ఇద్దరూ కొద్దిసేపు

తన్మయంగా అనుభవించాక "వాట్ నెక్స్ట్?" అనుకున్నాడు చిట్టిబాబు మనసులో.

అంటే... మరీ అంత అమాయకుడు కాదు గానీ, కొత్త కాబట్టి కన్‌ఫ్యూజ్ అయ్యాడంతే!

ఆ కన్‌ఫ్యూజన్‌లో అతనామె చెంపల్ని నిమురుతూ "ఎలా వుంది ఈ అనుభూతి?" అనడిగాడు ప్రేమగా.

"చాలా బాగుందండీ! మీరప్పుడే నా పెదవుల్ని వదిలేసినందుకు చాలా చాలా బాధగా వుంది. మరీ ఇంత స్లో అయితే ఎలా? రెచ్చిపోవాలి గానీ!" అని మనసులో అనుకుని 'ఛీ పాడు" అంటూ పైకి బిడియంగా నవ్వింది రుద్రమ.

ఆమె మనసులో అలా అనుకున్నందుకు చాలా చాలా సంతోషపడిపోతూ "అయితే నీలో నాకన్నా ఎక్కువే వుందన్నమాట శోభనాత్రం" అన్నాడు చిట్టిబాబు ఉత్సాహంగా.

అతనలా అనగానే తన మనసులోని మాట అతనికి తెలిసిపోయిందని తెలిసిపోయి తెగ బోలెడు సిగ్గుపడిపోయింది రుద్రమ.

'ఈ మనిషితో చాలా డేంజరు బాబూ!' అని మామూలుగా అనుకున్నట్లే అనుకుని "నాలో ఏం లేదు అలాంటి ఆత్రం" అంది పైకి బింకంగా బుంగమూతి పెట్టి.

"ఉందో... లేదో...నాకు తెలిసిపోయిందిలే మేడమ్. తమరింక ఎంత బింకంగా వున్నా, ఎంత బుకాయించినా లాభంలేదు. సరే... తమరు కోరుకున్నట్లే స్లోనెస్ తగ్గించి రెచ్చిపోతానయితే..." అని నిజంగానే రెచ్చిపోవడం ప్రారంభించాడు చిట్టిబాబు.

అతనికి పూర్తిగా సహకరిస్తూ అతని చేతిలో ఒక మైనపు ముద్దలా మారిపోయింది రుద్రమ.

ఫలితంగా ఆ మూడోరాత్రి నిజమైన తొలి రాత్రిగా మారి మధురాతి మధురంగా తెల్లవారింది వాళ్ళిద్దరికీ.

◆ ◆ ◆

ఇల్లు అలగ్గానే పండగైపోయినట్టు కాదు గదా!

ఎలాగోలా శోభనం జరిగిపోయినంత మాత్రాన్న కథ సుఖాంతమై పోయినట్టు కాదు గదా!

నాలుగోనాటి రాత్రి మళ్ళీ స్టార్టయి పోయింది ప్రాబ్లం!

"అబ్బా! నేనెంత అదృష్టవంతుడ్ని రుద్రా!" అంటూ చిట్టిబాబు తనని ప్రేమగా వాటేసుకుంటుంటే–

"ఎందుకనో?" అని తనూ ప్రేమగానే అడిగింది రుద్రమ.

"ఎంత అదృష్టవంతుడ్నికాకపోతే నాకు నీలాంటి అందమైన భార్య దొరుకుతుందా?" అంటూ ఉందాకటి తన స్టేట్‌మెంట్‌కి వివరణ ఇచ్చాడు చిట్టిబాబు.


ఎంతయినా రుద్రమ ఒక స్త్రీ గదా! భర్త తన అందాన్నలా పొగుడుతుంటే మురిసిపో కుండా ఎలా వుండగలుగుతుంది!

సహజంగానే మురిసిపోయిందామె!

ఒక ప్రక్క అలా మురిసిపోతూనే 'ఆ మాటా నిజమేలే!...' అని అనుకుంది మనసులో గర్వంగా.

అది గ్రహించి "తాను అందగత్తెనని ఎంత గర్వమో!' అనుకున్నాడు చిట్టిబాబు మనసులో.

'సహజమేలే... అందగత్తెలకు ఆ పాటి గర్వం వుండటం సహజమేలే!' అని కూడా



అనుకున్నాడంతలోనే.

రుద్రమ 'ఆ మాట నిజమేలే!' అని అనుకున్న తర్వాత మరేం అనుకోకపోయి వుంటే బాగుండేది. కానీ విపరీతబుద్ధి ఆమెని ఇంకో మాటకూడా అనుకునేలా చేసింది.

'నా అందానికి ఏ నవమన్మథుడో రావాలి న్యాయంగా! ఛ్... ఇలాంటిదీ చిట్టిబాబు దొరికాడు...' అనుకుంది మనసులో.

దాంతో నేరుగలేగానే మళ్ళీ ప్రాబ్లం స్టార్టయి పోయింది.

ఆమె అంతరంగాన్ని చదివేసి "అయితే నేన్నీకు తగినవాడిని కానని, నువ్వింకా బాధపడుతూనే వున్నావా రుద్రూ?" అన్నాడు చిట్టిబాబు రుద్ధకంఠంతో.

గతుక్కుమంది రుద్రమ.

అయినా... అప్పుడింక చేయగలిగింది ఏముందింక.

జరిగిందినా లాభం లేదని తెలుసు కాబట్టి "సారీ అండీ!..." అంది తల దించు కుంటూ.

లారీతోగుద్దించినంత బాధ కలిగింది 'సారీ' అంటే సరిపోతుందా?

"నేన్నీకు తగననుకుంటే ఆ సంగతి మన పెళ్ళికి ముందే ఆలోచించాల్సింది రుద్రూ! అంతేగానీ, నా భార్యవి అయ్యాక కూడా నువ్విలా ఆలోచించడం ఏం బాగాలేదు..." అన్నాడు చిట్టిబాబు ముఖాన్ని చిన్నబుచ్చుకుంటూ.

"తప్పయిపోయిందని ఒప్పుకుంటున్నాగా! ఇంకొదిలేయండి ఆ విషయాన్ని! అయినా మీకున్న వెధవశక్తివల్ల నా మనసులోని మాటలు తెలిసిపోతున్నాయి గానీ లేకుంటే నేనేమనుకున్నా మీకు తెలిసి వుండేది కాదుగా!" అంది రుద్రమ ఎటో చూస్తూ ఏదో ఆలోచిస్తూ.

"ఆ వెధవశక్తే ఈనాడు మనల్నింత ఉన్నత స్థితికి తెచ్చింది. ఆ వెధవ శక్తే మనిద్దర్నీ ఒకటి చేసింది. ప్రపంచంలో ఏ వ్యక్తికీ లేని శక్తి నీ భర్తకు వున్నందుకు గర్వించాల్సింది పోయి... దాన్ని వెధవశక్తి అంటావా?" కోపంగా అన్నాడు చిట్టిబాబు.

"పోనీ... మంచిశక్తేలే! ఇంకొదిలేయండి దాన్ని" కాస్త చిరాగ్గా అంది రుద్రమ.



'ఎలారా బాబూ! ఈ డేంజరస్ మనిషితో వేగేది!' అనుకుంది మనసులో.

ప్రయత్నిస్తే ఒక్కోసారి సాధ్యం కావచ్చేమో తప్ప ప్రతిక్షణం మనసుని అదుపులో వుంచుకోవడం ఎవరివల్లా మాత్రం అవుతుంది!

"అదిగో మళ్ళీ డేంజరస్ మనిషి అనుకుంటున్నావ్..." ఉక్రోషపడ్డాడు చిట్టిబాబు.

"తప్పయిపోయిందిలే మహానుభావా!... ఇంకేం అనుకోన్లే! ఈసారికి క్షమించండి" అంది రుద్రమ.

అలా అంటున్నప్పుడామెలోని చిరాకు సహజంగానే ద్విగుణీకృతమయ్యింది.

అది గమనించి బాగా నొచ్చుకున్నాడు చిట్టిబాబు.

"దయచేసి నువ్వు నీ మనసులో నా గురించి ఏం అనుకోవద్దు. నువ్విలా అలవాటు గనక మానుకోకపోతే నేను ప్రతిక్షణం ఇలా ఫీలవుతూనే వుండాల్సొస్తుంది" అన్నాడు చిట్టిబాబు రిక్వెస్టింగ్‌గా.

"సర్లెండి...సర్లెండి! ఇంకేం అనుకోన్లెండి..." ముఖం తిప్పుకుంటూ అంది రుద్రమ.

"ఎలా సాధ్యం అది మాత్రం?' అనుకుంది మనసులో వెంటనే.

"ఎందుకు కాదు?... గట్టిగా ప్రయత్నించు" అన్నాడు చిట్టిబాబు కొంచెం మందలింపుగా.

'ఏంటి ప్రయత్నించేది... నా బొంద' అనుకుని "సర్లెండి... సర్లెండి." అనేసింది రుద్రమ మళ్ళీ గబగబా!

"అలా నా బొంద గింద అనుకోబాకు...



గట్టిగా ప్రయత్నించమంటున్నావా!"

అతను నుదురు చిట్లించి అలా అంటుంటే 'నా నుదిటిరాత ఇలా తగలబడిందేమిట్రా భగవంతుడా!' అని అనుకోకుండా వుండలేక పోయింది రుద్రమ.

ఆ విషయం చిట్టిబాబుకి తెలియకుండా ఎలా వుంటుంది?

"ఏమైందేంటే నీ నుదుటిరాతకిప్పుడు?...." అన్నాడు కోపం ద్విగుణీకృతం కాగా.


"ఇంతకన్నా ఏం కావాలి? తన మనసులోని మాటను చదవగలిగే భర్త ఏ ఆడదానికి దొరకుతాడు" అంది రుద్రమ మరింత కోపంగా.

"అదేంమాట? నువ్వు మనసులో ఏమేమో అనుకుంటున్నావు నా గురించి!... అందరూ నీలాగే వుంటారా?" ఉక్రోషంగా చూశాడు చిట్టిబాబు.

"తప్పకుండా!... అందరూ కూడా నాలాగే వుంటారు. మనసులో భర్తగురించి ఏదో ఒకటి అనుకోకుండా ఎలా వుండగలుగుతారు?" అతని మాటల్ని ఖండిస్తూ అంది రుద్రమ.

"ఏదో ఒకటి అనుకోవడం వేరు. భర్తను గురించి తక్కువగా అనుకోవడం వేరు..." కోపాన్ని కాస్త తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు చిట్టిబాబు.

"నేనిప్పుడు మీగురించి తక్కువగా అను కున్నది ఏముంది?" చురచురా చూసింది రుద్రమ.



"మీకన్నా నా అందం గొప్పదన్నది నిజం." అంది నిక్కచ్చిగా.

"అయితే, నీ అందానికి తగినవాడినే చేసుకో లేకపోయావా? నన్నెందుకు చేసుకున్నావ్?" కోపాన్ని తగ్గించుకోవాలనికి ప్రయత్నించిన చిట్టిబాబు తిక్కరేగిపోగా పరుపుమీద ఒక్క గుద్దు గుద్దుతూ అన్నాడు.

తిక్క మగాళ్ళకే కాదు ఆడాళ్ళకీ రేగుతుంది కదా!" ఏం చెయ్యను!... నా తలరాత ఇలా తగలడింది మరి!" అనేసింది రుద్రమ తను కూడా పరుపుమీద గుద్దుతూ.


"ఛఛ" అనుకుంటూ ముసుగు తన్నేసి పడు కుండిపోయాడు చిట్టిబాబు.

దాంతో 'ఖర్మ' అనుకుంటూ, దిండూ దుప్పటి తీసుకుని అక్కడినుండి విసవిసా వెళ్ళి పోయింది రుద్రమ.

✦ ✦ ✦

ఏ ఒక్కరోజో కలుసుకుంటూ మిగతా అన్ని రోజులూ కీచులాడుకుంటూ వీళ్ళాళ్ళ కిలపోల కాపురం?"

ఓ పదిహేనురోజుల తర్వాత ఒకరోజు తన గదిలో ఒంటరిగా కూర్చుని ఆవేదనగా అను కున్నాడు చిట్టిబాబు. (సశేషం)





కథ

బాధయాత్ర

ఎమ్.వి.జె.భువనేశ్వరరావు

"లేదు సార్ లాభంలేదు... మీ రక్తంలో కొలెస్ట్రాల్ బాగా పెరిగింది.... వెంటనే జాగ్రత్తలు తీసుకోకపోతే కష్టం."

డాక్టర్ చెప్పిన మాట విని ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు.

"రోజుకొక్కసారే చికెన్‌గానీ, మటన్ గానీ ఓ అరకేజీ మాత్రమే తింటాను... ఈ మాత్రానికే కొవ్వు పెరిగిపోయిందా?!"

ఎదురు ప్రశ్నించాడు సుబ్బారావు.

వెంటనే తన అసిస్టెంటు వేపు చూసి-

"నువ్వు తెప్పిస్తున్న చికెన్‌సెంటర్ వాళ్ళకి చెప్పు... కొవ్వు ఎక్కువగా వెయ్యొద్దని" అని జాగ్రత్త కూడా చెప్పాడు.

"అదేమీ కాదు సార్... మీరు వారానికొకసారి మాత్రమే నాన్-వెజ్ తినాలి... కనీసం రెండు సంవత్సరాల పాటిలా చేస్తే తప్ప... కొలెస్ట్రాల్ నార్మల్‌కి రాదండి..." మధ్యలో కలుగజేసుకొని డాక్టర్ నచ్చచెప్పాడు.

"అదేం కాదుగాని... ఇంకోమాట చెప్పవయ్యా డాక్టరూ... మాంసం నోట్లో పడకపోతే నాకు ప్రజాసేవ చెయ్యబుద్ధి కాదు..." అనునయంగా అన్నాడు సుబ్బారావు.

"సరే ఒకపని చెయ్యండి. మీరు నచ్చినవి కొంచెం తగ్గించి తినండి... దాంతోపాటు కాస్త శరీరాన్ని శ్రమపెట్టండి... అలాచేస్తే కొంచెం ఫలితం వుంటుంది."

"నువ్వు చెప్పింది నిజమేనయ్యా డాక్టరూ... గత ఏనిమిది సంవత్సరాలనుండీ అధికారంలోనే వుండటం వలన ఒళ్ళు బాగా సుఖమరిగిపోయింది... నువ్వు చెప్పినట్లే చేస్తాను..." అన్జెప్పి, అక్కడనుండి నిష్క్రమించాడు సుబ్బారావు.

◆ ◆ ◆

సచివాలయం అంతా సందడిగా వుంది.

నూట పైకి కేజీల బరువు ఉన్న తమ పార్టీ నాయకులందర్నీ రమ్మని పిలిచేసరికి...

మొత్తం ఎమ్మెల్యేల్లో మూడొంతుల మంది వచ్చి సుబ్బారావు ఆఫీసుముందు నిరీక్షించసాగారు.

ఆలస్యంగా అక్కడికి చేరుకొన్న సుబ్బారావుకి వాళ్ళందర్నీ చూడగానే చిరాకు కలిగింది.

"సెక్రటరీ! ఎవరు వీళ్ళంతా? ఎందుకోసం వచ్చియున్నారు?" కోపంగా అడిగాడు సుబ్బారావు. తాను పిల్చిన సంగతి మర్చిపోయి.

"మీరే కదా సార్... కొలెస్ట్రాల్ ఎక్కువున్న ఎమ్మెల్యేలందర్నీ పిలవమన్నారు" గుర్తుచేశాడు పి.ఎ.

కొంచెం తమాయించుకుని అందరినీ లోపలికి పిలిపించుకున్నాడు సుబ్బారావు.

"ఇప్పుడు మనం అధికారంలో వున్నాము... వచ్చే ఎన్నికల్లో కూడా ఉండాలి. అధికారం లేకపోతే గాలి తీసేసిన బెలూన్‌లమైపోతాం. విషం పీకేసిన పాములుగా మారిపోతాం. మనల్ని చూసి ఎవరూ భయపడరు. మన పనులూ సాగవు. కాబట్టి ఓ నిర్ణయం తీసుకొన్నా. వచ్చేవారమే నేను పాదయాత్ర పేరుతో ప్రజలవద్ద కెళతాను. నడవటం వలన ఆరోగ్యమూ బాగుపడుతుంది... అధికారమూ దక్కుతుంది. కొలెస్ట్రాల్ ఎక్కువగా వున్న నాయకులూ, కార్యకర్తల్నీ కలుపుకుని మనమందరం పాదయాత్రం సాగిద్దాం."

సుబ్బారావు చెప్పింది విని, చప్పట్లతో అభినందనల్ని, తమ ఆమోదాన్ని తెలియజేశారు ఎమ్మెల్యేలంతా!

తన తెలివితేటలకు తనకు తానే భుజాలు చరుచుకున్నాడు సుబ్బారావు.

◆ ◆ ◆

సుబ్బారావు 'పాదయాత్ర' మొదలవగానే, విజయవంతమైపోయింది.

ఎటుచూసినా జనం! సుబ్బారావు అడుగు ముందుకేస్తే చాలు. వేలాదిమంది ఆయనతో పాటు కదం త్రొక్కుతున్నారు. పత్రికల్లో కవరేజీలు కూడా అదిరిపోతున్నాయి.

సుబ్బారావు 'ప్రజాసేవ' కోసం ఎంతకైనా తెగిస్తాడని అధిష్టానానిక్కూడా తెలిసొచ్చింది.

సుబ్బారావు వేలాదిమంది మధ్యనుండి నడుస్తుండగా లఘుశంక మొదలైంది.

పాదయాత్ర ఆపలేడు. వాళ్ళందర్నీ తప్పించుకుని వెళ్ళలేడు... నాయకుల్నుండీ, సెక్యూరిటీ నుండీ ఎలాగోలా తప్పించుకోగల్గినా... ప్రజల్నుండి తప్పించుకొనే అవకాశమే లేదు.



అలా ఊహ మదిలో మెదలగానే, సుబ్బారావుకి ఉత్సాహం మరింత తీవ్రమైంది.

ఎంతగా ప్రయత్నించినా... అడుగు వేయజాలని పరిస్థితి! సుబ్బారావుని వెతుక్కుంటూ వచ్చింది అదృష్టం!

ఎదురుగా సులభ్ కాంప్లెక్స్!

ఆనందంతో గబగబా అడుగులు వేశాడు అటువేపు!

పాదయాత్రలో భాగంగా సులభ్ కాంప్లెక్స్‌లు కూడా సుబ్బారావు చెక్ చేస్తున్నాడని, ప్రెస్ కెమెరాలు క్లిక్‌మన్నాయి.

తనపని కానిచ్చేసి, సుబ్బారావు చల్లగా అక్కడనుండి బయటపడ్డారు.

✦ ✦ ✦

కాళ్ళు నొప్పెడుతున్నాయి...

కానీ పాదయాత్ర ఆపలేదు.

కళ్ళు లాగేస్తున్నాయి.

నరాలు తోడేస్తున్నాయి. నడుం పీకేస్తోంది. వెన్ను నొప్పెస్తోంది...

అప్పటికే వారమైంది.

కార్యకర్తలు... నాయకులు... ఎదురుగా కేజీల లెక్కన అలవాటు ప్రకారం చికెన్‌బిర్యానీలు తినేస్తున్నారు. కానీ తను తినలేడు. దాంతో ఆకలి చంపేస్తోంది.

నెత్తి మాడిపోతోంది...

చర్మం మొద్దుబారిపోతోంది.

మొహంపైన బుగ్గలు నల్లని బొగ్గులై పోయాయి.

పాదయాత్రకు రెస్పాన్స్ చూస్తే... గంట గంటకూ పెరిగిపోతోంది.

ప్రారంభించటం వరకూ తనిష్టమే అయ్యింది కాని ఆపటానికి అధిష్టానం అనుమతివ్వటం లేదు.

సుబ్బారావుకేం చెయ్యాలో అర్థం కాలేదు.

ఆఫీసులో కూర్చుంటే... నాలుగు ఫైళ్ళమీద సంతకాలు చేస్తే... రోజుకు నాలుగు లక్షలైనా వచ్చేవి. ఇప్పుడా మేరకు సుబ్బారావు ఆదాయానికి గండిపడింది. వారంరోజులకు ఓ స్కాం చేసుకొన్నాగాని రెండు, మూడు కోట్లు మిగిలేవి.

ఇప్పుడదంతా నష్టమే.

ఇంకా పాదయాత్ర చెయ్యటంలో అర్థం లేదు.

పి.ఎ.ని పిలిచాడు. "సెక్రటరీ! మన పాదయాత్రకు ఇంత రెస్పాన్స్ వచ్చేసింది. ఏంటంటావ్ కారణం" సందేహం వెలిబుచ్చాడు.

"అధికారంలో వున్నారు కదా... నామినేటెడ్ పదవులిస్తారనో, ఏమైనా వరాలు ప్రకటిస్తారనో, పనులు చేసిపెడతారనో జనం మీవెంట పడుతున్నార్సార్... వీళ్ళంతా మనకి ఓటేస్తారని గ్యారంటీ లేదు."

"సర్లేవయ్యా... నువ్వు చెప్పింది విన్నాక... నాకు గుండెపోటు వచ్చే లాగుంది. క్రిందపడి పోతాను... నాకు వైద్య సేవలు, విశ్రాంతి అవసరమన్నప్పుడు ఆసుపత్రిలో చేర్పించు... కాళ్ళు నొప్పెడుతున్నాయి. తప్పదు"

పి.ఎ.కి విషయం అర్థమైంది.


సుబ్బారావుకి కళ్ళు బైర్లుకమ్మి, క్రింద పడిపోయాడు. అత్యవసరంగా అంబులెన్స్ వచ్చింది.

సుబ్బారావు పాదయాత్ర అర్ధాంతరంగా ఆగింది.



పసుపులేటి సుధారాణి

లాఫింగ్ జోక్





ఆ కాలు నాదే...

తెల్లవారుజాము.

సమయం మూడు గంటల సలభై ఐదు నిముషాలు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా బయలుదేరింది.

అమర్‌నాథ్, లలితాదేవి, దివిజ, అమృతలు తమ బెర్త్‌లు ఎక్కడో చూసుకుని లగేజ్ అంతా అయా బెర్త్‌ల కింద సర్ది, 'హమ్మయ్య' అని కూర్చునేటప్పటికి రైలు కొండపల్లి దాటేసింది.

ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్యలో ఇంటి దగ్గర వున్న ఆత్మీయులతో ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఎలాగైతేనేం రాత్రి వరకూ



గడిపేశారు నలుగురూ.

"అప్పుడమ్మా! ఇంకా రేపొద్దున్న వరకూ ఈ ట్రైన్‌లో వుండాలి కదూ!" విసుగ్గా అంది దివిజ.

"అవునమ్మా! రేపు ఉదయం ఏడుగంటలకి మనం ఢిల్లీ వెళ్ళిపోతాం. ఇంకా ఎంతో ఇప్పుడు డిన్నర్ చేసి పడుకొంటే తెల్లవారిపోతుంది" అన్నారు అమర్‌నాథ్‌గారు.

ఇంతకీ ఆ నలుగురూ చార్‌ధామ్ యాత్రకి బయలుదేరారు.

ఢిల్లీలో ట్రైన్ దిగగానే ట్రావెల్స్ ప్యాకేజీ వాళ్ళు వచ్చి పికప్ చేసుకుంటారు. అక్కడినుండి బస్‌లో బయలుదేరతారు అందరూ.

ఇంటివద్దనుండి తెచ్చుకున్న ఆహార పదార్థాలను తిని, జోక్స్ వేసుకుంటూ కాసేపు కూర్చున్నారు. అందరిలోకి సరదాగా మాట్లాడే వ్యక్తి దివిజ.

కాని, ఆ సమయంలో మాట్లాడుతూ మాట్లాడుతూ ఎదురు బెర్త్‌పై పెట్టిన తన పాదాలను చూసి ఏదో ఆలోచనలో మునిగిపోయింది.

కాసేపటికి అందరూ నిద్రకుపక్రమించారు.

✦ ✦ ✦

అర్ధరాత్రి, ఒంటిగంట దాటుతోంది.

ప్రయాణీకులంతా గాఢనిద్రలో మునిగి పోయి వున్నారు.

దడ్... దడ్... దడ్... ఏం జరుగుతుందో తెలియకుండానే, నిద్రలోంచి పూర్తిగా మెలకువ రాకుండానే ఆ ప్రదేశమంతా హాహాకారాలతో దద్దరిల్లిపోసాగింది.

స్త్రీ, పురుష, చిన్నా, పెద్ద తేడాలు లేకుండా అందరి ఆర్తనాదాలతో ఆ ప్రదేశమంతా మారుమ్రోగిపోతోంది. గంటలోపే అంబులెన్స్‌లు వచ్చాయి. డాక్టర్లు, నర్సులు, వాలంటీర్‌లు తమ తమ డ్యూటీలను వేగంగా నిర్వర్తించసాగారు.

"సార్! ఈ అమ్మాయికి మోకాలు కింది నుండి పాదం కట్ అయిపోయింది. కాని ఆ పాదం ఎక్కడా కనిపించడం లేదు" ఒక వాలంటీర్ డాక్టర్‌తో చెప్పాడు.

"ఆ అమ్మాయి ఎక్కడ పడివుందో అక్కడే వెతకండి. కనిపిస్తుంది" వేరేవాళ్ళకి తాత్కాలిక వైద్యం చేస్తూ చెప్పాడు డాక్టర్.

"లేదు సార్! ఇక్కడ పాదం ఒకటి వుంది కాని అది ఈ అమ్మాయిది కాదు" చెప్పాడు వాలంటీర్.

అక్కడే స్ట్రెచర్‌పై వున్న దివిజ బాధతో విలవిలలాడుతూనే ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది.

"త్వరగా వెదుకు. అది ఇక్కడే ఎక్కడో పడి వుంటుంది. వెంటనే దొరికితే ఈ అమ్మాయి అదృష్టం. అతికించే ప్రయత్నం చేయొచ్చు" తను చేస్తున్న పని ఆపకుండానే చెప్పాడు డాక్టర్.

వాలంటీర్‌ని దగ్గరకు రమ్మని సైగ చేసింది దివిజ బాధను ఓర్చుకోడానికి ప్రయత్నిస్తూ.

అది గమనించిన అతను దగ్గరకు వచ్చి "ఏమిటమ్మా?" అడిగాడు ఓదార్పుగా.

"ఆ కాలు నాదే!" అని అతని చేతిలోని పోలిథిన్ బ్యాగ్‌లో పెట్టి పట్టుకున్న పాదాన్ని చూపిస్తూ అతి కష్టంమీద చెప్పింది దివిజ.

"కాదమ్మా! ఈ పాదం నీదికాదు నాకు తెలుసు కదా?" అనునయంగా అన్నాడు.

'ఎవరిదైతేనేం, అది తనకు సెట్ చేస్తే చాలు అని అనుకుంటుందేమో... కాలు పోయిన బాధలో. పిచ్చితల్లి!' అనుకున్నాడు మనసులో సానుభూతిగా.

"నామాట వినండి! అది నా కాలే!" అంత బాధలోనూ అరిచినంత పని చేసింది దివిజ.

పోనీలే అని సహాయం చేస్తుంటే... నామీదే అరుస్తుందా అని ఒళ్ళు మండిపోయింది వాలంటీర్‌కి. "చెప్తుంటే నీక్కాదూ! ఈ కాలు నీదికాదు. నాకా మాత్రం తెలియదా?..." అంటూ విసుక్కుని చేతిలో వున్న సంచిని దూరంగా విసిరి పారేశాడు.

"ఆ కాలు నాదే... ఆ కాలు నాదే..." ఏడుస్తూ విలవిలలాడింది దివిజ.

✦ ✦ ✦

"ఆ కాలు నాదే... ఆ కాలు నాదే..." పెద్దగా అరుస్తున్న దివిజను తట్టి లేపింది లలితాదేవి. అప్పటికే అమర్‌నాథ్‌గారు, అమృత కూడా లేచి కూర్చున్నారు.

"దివీ! దివీ! ఏమిటి, ఏమైంది?... ఏదైనా పీడకల వచ్చిందా?" లేచికూర్చుని అయోమయంగా చూస్తున్న దివిజను ఆప్యాయంగా అడిగింది లలితాదేవి.

అవునన్నట్టుగా తలవూపింది దివిజ.

"దివక్కా ఇదిగో, మంచినీళ్ళు తాగు ముందు" అంటూ వాటర్‌బాటిల్ అందించింది అమృత.

"ఏం పీడకల వచ్చింది దివీ?" దివిజ తలపై చెయ్యివేసి నిమురుతూ అనునయంగా అడిగింది లలితాదేవి.

"వదినా... మరే..." కనురెప్పలు రెపరెపలాడిస్తూ చెప్పడం మొదలు పెట్టింది దివిజ.

"ఊ... చెప్పు" అన్నారు అమర్‌నాథ్‌గారు.

"మరే... ఈ ట్రైన్ బ్రిడ్జి పైనుండి వెళుతుంటే ఒక లోయలో పడిపోయిందట. మీరెవరూ కనిపించలేదు. నాకేమో ఒక కాలు మోకాలు కిందనుండి కట్ అయిపోయింది. నా కాలు వాలంటీర్ చేతిలో పెట్టుకుని 'ఈ అమ్మాయిది కట్ అయిన కాలు కనిపించటంలేదు' అని చెప్తున్నాడు. ఆ కాలు నాది అని ఎంత చెప్పినా వినిపించుకోటం లేదు వదినా!"

అది అది చెబుతున్న దివిజని విస్మయంగా చూశారు ముగ్గురూ.

"శుభమా అని తీర్థయాత్రకు వెళుతుంటే నీకీ పాడు పీడకల ఎందుకు వచ్చింది?" అడిగారు లలితాదేవి.

"వదినా! నేను ఇంటిదగ్గర గోళ్ళరంగు వేసుకుంటున్నప్పుడు ఒక కాలికి వేసుకునేసరికి టైమయిపోయింది. కంగారుగా బయలుదేరుతూ ట్రైన్‌లో వేసుకోవచ్చులే అని వచ్చేశాను" చెప్పింది దివిజ.

అప్పుడు చూశారు ముగ్గురూ దివిజ పాదాలవైపు. ఒక కాలివేళ్ళకి గోళ్ళరంగు వుంటే మరో కాలివేళ్ళు తెల్లగా వున్నాయి.

"ఆ వాలంటీర్ చేతిలో వున్నది గోళ్ళరంగు వెయ్యని పాదం అన్నమాట! అందుకే అది నాది కాదని తుప్పల్లోకి విసిరేశాడు వదినా" కూగా, అమాయకంగా చెప్పింది దివిజ.


"మరి ట్రైన్ ఎక్కిన తర్వాత వేసుకుంటే నీకింతటి భయంకరమైన కల వచ్చేది కాదు కదా అక్కా!" నవ్వుతున్న నవ్వును ఆపుకుంటూ అన్నది అమృత.

"అవును రా. అమ్మో! మధ్యాహ్నం వేసుకుందామని చూశాను. కాని హడావిడిలో గోళ్ళరంగు సీసా తీసుకురావడం మర్చిపోయాను" దిగులుగా చెప్పింది దివిజ.


ఆ అర్ధరాత్రి సమయంలో పెద్దగా నవ్వితే తోటి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగుతుందని నవ్వును ఆపుకోడానికి విశ్వప్రయత్నం చేశారు దివిజతో సహా.

యాక్సిడెంట్లు









నాకొక శ్రీమతి కావాలి

డా॥మంతెన సూర్యనారాయణరాజు

"ఏమంటారోయ్ లంబోదరమూర్తిగారూ! మీరు అందరిలాగా కల్యాణం కావాలి? బాంధవ్యాలు జరిపించాలి! అడిగినవన్నీ జరిపించాలంటే పెళ్ళవ్వడం కష్టమే సుమండీ. ఎందుకంటే అందరిలా మీ వయస్సు బాగా తక్కువేం కాదు. పైగా మిమ్మల్ని మీ భారీ శరీరాన్ని చూసిన ఏ పిల్ల తల్లిదండ్రులైనా ఇద్దరి బిడ్డల తండ్రిలాగున్నారంటున్నారు....


నేను మీ గురించి వకాల్తా తీసుకుని ఆయన నియమ నిష్ఠాగరిష్ఠుడని, నిత్య దైవచింతనా పరుడని ఎంత చెప్పినా ఆ ముక్కలు నమ్ముతున్నారు. కాని మీ ఉద్యోగం వుంది చూశారూ... అది పర్మినెంటు కానందుకు ఆడపిల్లలు, వాళ్ళ తల్లిదండ్రులు పిల్లాడికి స్థిరమైన ఉద్యోగం లేదని.. చూడ్డానికి మోటుగా వున్నాడనీ పెదవి విరిచి పారిపోతున్నారంటే నమ్మండి. నేను చెప్పాల్సింది చెప్పాను. ఆ తర్వాత మీ ఇష్టం" అంది ఆ మేరేజ్ బ్యూరోలో పనిచేసే హంసవేణి.



లంబోదరమూర్తి నిరుత్సాహంతో-

"మిమ్మల్ని నమ్ముకుని మా ఊర్నుంచి వెళ్ళైనా పాజిటివ్ న్యూస్ చెబుతారని ఐదుసార్లే వచ్చాను. ఇప్పటికి బ్రోకర్లను నమ్ముకుని పది వేలు తగలేసా! అంతేనా... మీ మ్యారేజ్‌బ్యూరోకి ఐదువేలు ఫీజుకూడా కట్టి పదినెలలైంది. నా దగ్గర క్యాష్ కట్టించుకున్న ఆ కోమలి ఇదిగో పిల్లుంది, అదిగో అక్కడ అమ్మాయుంది అనడమే తప్ప ఒక్కసారీ నాకు ఏ పిల్లనూ చూపించిన పాపాన పోలేదు. ఏమిటండీ ఈ దొంగ మాటల భాగోతం. పెళ్ళి కుదురుస్తారంటే కుదురుస్తానని, లేకుంటే మా వల్లకాదని ఏదోటి తేల్చి చెప్పాలి. ఎప్పుడడిగినా మీ రమా మణి కూడా ఇదిగో అదిగో వారం తిరక్కుండా మీకు పెళ్ళిచూపులే ఏర్పాటు చేయించే పూచీ నాదనడమే తప్ప, ఈ ఇన్నాళ్ళ ఆమె చూసేదీ లేదు, నే పెళ్ళి చేసుకునేదీ లేనట్టుంది. నాకు తిక్కలేస్తే ఆ కోమలినో, లేక మీ సంస్థ యజమానురాలు రమామణిగారి మెళ్ళోనో తాళి కట్టి పెళ్ళాడేస్తా! ఆ..." అన్నాడు.

నవ్వుతో పాటు సిగ్గుపడిపోతూ హంసవేణి "మూర్తిగారూ! మీరంత పనిచేసి నవ్వులపాలుగావడం నాకిష్టం లేదు. ఒకవేళ మా యజమానురాలు రమామణిగార్ని నేను కోవాలన్నా వీలుపడదు. ఎందుకంటే ఆమెకు ఇద్దరు పిల్లలు. మగపిల్లవాడు పెద్దాడు. వాడి వయస్సు పద్ధెనిమిదేళ్ళు. కూతురు కాస్త లేటుగా పుట్టడం వల్ల ఆ పిల్లకి ఎనిమిదేళ్ళు. పైగా రమామణిగార్ని మీరు పెళ్ళాడతానని అన్నట్లు తెలిస్తే... వాళ్ళాయన అసలే మిలట్రీ వాడు. గన్ తీసుకు మరీ వస్తాడు. ఇక క్యాషియర్ కోమలిగారి భర్త... స్కూలుటీచర్. వాళ్ళిద్దరికీ రెండేళ్ళ కొడుకున్నాడు.... అందుకని మీరు ఎలాగూ అప్పటి దాకా ఆగారు.



నా మాట విని ఇంకొర్తి కాలం ఓపిక పట్టండి" అంది.

హంసవేణి మాటలు రుచించక మూర్తి భృకుటి ముడేస్తూ "నాకు మీరింక ఏం చెప్పకండి మేడమ్. నాక్కోపమొస్తే పసుపుకొమ్ము తాడుకు కట్టి మీ మెళ్ళో మూడుముళ్ళూ వేసి మీకు రెడీమేడ్ మొగుణ్ణైపోతా! ఆ!" అన్నాడు లంబోదరమూర్తి.

"సారీ!... మిమ్మల్ని డిజప్పాయింట్ చేస్తున్నాను. ఎందుకంటే నాకు మేనరికం పెళ్ళి నిశ్చయించింది మా దొడ్డమ్మ టికెట్ తప్పేసింది. అందుకని మీరు ఏదాన్నైపోయి నా ఉద్యోగానికీ, బంధుత్వానికీ దయచేసి ప్రతిబంధకం కాకండి. ప్లీజ్" అంది.

విచారవదనంతో మూర్తి-

"తలమీద ఎకరం నేల బట్టబయిల వచ్చేసింది అప్పుడే! తలవెంట్రుకలు అక్కడక్కడా వెండితీగల్లా మెరిసి అద్దంలో చూసుకున్నప్పుడల్లా అవి నన్ను వెక్కిరిస్తున్నాయ్! అయినా అందరి పెళ్ళికూతుళ్ళకూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే కావాలట. వెధవ గొంతెమ్మకోర్కెలు కాకపోతే! మాలాంటి పంతుళ్ళు, గుమాస్తాలు, డిప్లొమా హోల్డర్స్, ఎకౌంటెంట్స్ ఇంకా చిన్నా చితకా ఉద్యోగస్తులు వాళ్ళకళ్ళకి ఆనరా! వీటికి తోడు ప్రతి అమ్మాయీ ఈ మధ్య మగవాణ్ణి పట్టుకుని మీకు వంటా వార్పూ వచ్చా అని అడగడం ఒక ఫేషనైపోయింది. అంతేనా! నీకు ఐదంకెల జీతం వస్తోందా! అని డైరెక్టుగా అడిగేస్తున్నారు. ఇది చాలా చాలా అన్యాయం, అక్రమం. దయచేసి మిమ్మల్ని వేడుకుంటున్నాను. మీరైనా నన్నర్థం చేసుకుని అయినింటి అమ్మాయిని చూసి పెట్టండి. ఆస్తి అంతస్తు లేకున్నా ఇబ్బంది లేదు. దక్షిణమస్సలే కానక్కర్లేదు. గుణవంతురాలు, సంసారపక్షమైన అందముంటే చాలు. ఈ ఉపకారం చేసి పుణ్యం కట్టుకోండి. మరి నే వెళ్ళొస్తాను.... ఆదివారం మాకు సెలవు. అప్పుడు తిరిగి మిమ్మల్ని కలుస్తాను...." అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు లంబోదరమూర్తి.

◆ ◆ ◆

అంబికాక్యాంటీన్‌లో విలాసరావు, లంబోదరమూర్తి ఇద్దరూ కబుర్లాడుకుంటూ టీ చప్పరిస్తున్నారు.

విలాసరావు నోరు కాస్త పెద్దది. అదే పనిగా ఎప్పుడూ దేవుళ్ళను, బాబాలను తిడుతుంటాడు. అందుకు కారణం అతని భార్య ఎదురింట్లో అద్దెకుండే పీతాంబరంతో లేచిపోయింది.

ఒకవేపు ఆడదాని చాంచల్యం మీద విరక్తితో అనే ప్రేలాపనలు...., మరోవేపు ఆడదాని తోడు కోసం పెళ్ళి అనే మూడుముళ్ళ బంధంకోసం అంగలార్చడం.

విలాసరావు తనదైన ధోరణిలో "నువ్వెన్ని చెప్పు మూర్తీ! నాకు మాత్రం అసలుమహిళా జెండర్ మీదే ద్వేషం కలుగుతుందంటే నమ్ము" అన్నాడు భార్య అఘాయిత్యాన్ని తల్చుకుని.

టేబుల్‌మీద ఖాళీ కప్పు ముందుకు గెంటుతూ చాలా విచారంగా మూర్తి "అసలు దేవుడిమీదే నమ్మకం పోతూందిరా!... నువ్వు పెళ్ళి చేసుకుని సుఖం లేక అఘోరిస్తున్నావు.... నేను అసలు పెళ్ళికాక ముదిరిన బెండకాయలాగ బ్రహ్మచర్యం పేరుతో ఏ సుఖంలేక దిగులు పడుతున్నాను. అందుకే నా సమస్య పరిష్కారం కోసం ఓ మంచి సిద్ధాంతి దగ్గరకు వెళ్ళాలని అనుకుంటున్నాను.ఏమంటావ్?"

"మంచిదే. ప్రయత్నించి చూడు!"

ఇద్దరూ లేచి బయటకు వచ్చారు బిల్ కట్టి.

◆ ◆ ◆

జాతకరత్న అనంతరాం దగ్గరకు జాతకం తీసుకుని లంబోదరమూర్తి వెళ్ళాడు.



అప్పటికే వెయిటింగ్‌లో ఎంతోమంది పడి గాపులు పడుతున్నారు.

ఏభైయొన్న నెంబర్ టోకెన్‌కుర్రాడు ఇచ్చి వెళ్ళాడు. ఇదెక్కడి ప్రారబ్ధం, హాస్పిటల్‌లో పేషెంట్స్‌కిచ్చినట్టు, ఇ-సేవాలో కష్టమర్లకి సీరియల్ నెంబరిచ్చినట్టు అని కుర్రాడిని దగ్గరకు రమ్మని పిల్చాడు.

"ఇదేమిటున్నంది? ఎందుకు పెట్టినట్టు" అని అడిగాడు.

"ఏమో సార్! మా సార్‌కి డిమాండ్ పెరిగి, ఈ సిస్టమ్ పెట్టి ఆరునెలలు కావస్తోంది. అందుకని మీకేమైనా పనుంటే వెళ్ళి అది చూసుకుని ఓ గంటలో తిరిగిరండి" అన్నాడు.

వంటకుక్కర్ పాడైతే అది బాగుచేయించుకుని సరిగ్గా గంటకి లంబోదరమూర్తి అనంతరాం ఇంటికి వచ్చా వచ్చాడు.

కుర్రాడు వినయంగా "రండి సార్! నెక్స్ట్ మీరే వెళ్ళండి" అన్నాడు.

మరొకర్ని పంపమన్నట్టు వెంటనే కాలింగ్ బెల్ మ్రోగడంతో "మీరెళ్ళండి" అన్నాడా యువకుడు.

ఆలస్యం చెయ్యకుండా అతని గదిలో ప్రవేశించి నమస్కరించాడు మూర్తి.

ప్రతినమస్కారం చెయ్యలేదుగాని, అనంతరాం వెర్రిబ్బాగులాడిలా ఓ చిరునవ్వు నవ్వాడు.

దగ్గరకు రాగానే లంబోదరమూర్తిని కూర్చోమని సైగచేసి అతను ఇచ్చిన జాతక చక్రం పేపర్ చూడసాగాడు.



చూడ్డం అవి ఒక్కసారి కళ్ళు మూసుకుని తనలో తానే ఏదో గొణుక్కున్నాడు.

"చెప్పు నీ వ్యవహారం, నా దగ్గరకు ఎందుకొచ్చినట్టు?" అంటూ అడిగాడు అనంతరాం.

లంబోదరమూర్తి ఏవిటో వ్యవహారం ఎలా మొదలుపెడితే బాగుంటుంది అని టిపోర్టల్ చేసి మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

నిజానికి అనంతరాం శక్తిసామర్థ్యాలు ఏ పాటివో పరీక్షించాలని కోరికగా వుంది. అందుకని దగ్గి, "అనంతరాంగారూ! నాకు పిల్లలు పుట్టే అవకాశం వుందా! వుంటే ఎన్నో ఏడు పుట్టొచ్చు?" అంటూ అడిగాడు.

అతగాడు మాత్రం తక్కువ తిన్నాడా!

వెంటనే "బాగుందయ్యా నీ అతితెలివి. నన్నే బురిడీ కొట్టిద్దామనా! త్రికాలజ్ఞుడ్ని. అసలు నీకు పెళ్ళే కానప్పుడు... పిల్లలప్పుడే ఎలా పుడతారు. ఒకవేళ పుట్టినా ఆ సంతానానికి అక్రమ సంతానం అని చెప్పాల్సి వుంటుంది. నే చెప్పే రెండుముక్కలూ బాగా మనసుకి పట్టించుకుని విను. నువ్వేమో ఎప్పుడూ ఈస్ట్‌మన్ కలర్ కలలు కంటుంటావు. నీ గ్రహచారం అందుకు విరుద్ధంగా వుంటుంది" అంటూ ఆగాడు.

లంబోదరమూర్తి "అర్థం కాలేదు" అన్నాడు.

"అయితే విడమర్చి చెబుతాను విను. నువ్వు ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్‌లాంటి అమ్మాయిని పెళ్ళాడాలని అనుకుంటావు. కనీసం కల్పనా రాయ్‌లాంటి బొద్దుగుమ్మడికాయ కూడా నిన్ను పెళ్ళాడటానికి ముందుకు రావట్లేదు. యామ్ ఐ కరెక్ట్" అని అడిగాడు.

మూర్తి తలవంచుకున్నాడు.

వచ్చిన పనిని సానుకూలం చేసుకోవాలని 116 రూపాయలు అతనికి దక్షిణగా సమర్పించుకున్నాడు. అనంతరాం ఆ సొమ్మును లాల్చీజేబులోకి జారవిడుస్తూ "నేనో మంత్రం వ్రాసిస్తా! అది రోజూ రెండుమూడు గంటలు జపించు. అలా ఓ నలభై అయిదురోజులు చేస్తే ఫలితం కనిపించవచ్చు. అదీగాక శుక్ర గ్రహానికి శాంతి చేయించు. వీలుంటే పుష్య రాగం ఉంగరం వెండితో చేయించుకుని... చూపుడు వేలికి తొడుగు. కుడిచేతివేలని తెలిసిందా!" అని మిన్నకుండిపోయాడు.



"పెండ్లి కొరకబ్బగా ఎప్పుడౌతుందో చెప్పు రేరా?" అని కూర్చున్నచోటునుండే లేస్తూ మూర్తి ప్రశ్నించాడు.

"నాయనా! నేను గణితం వేసి నా ఉపాసన ధ్యానాలో భవిష్యత్తు చెబుతుంటాను. అంతే గాని సృష్టికి ప్రతిసృష్టి చేయగల విశ్వామిత్రుణ్ణి మాత్రం కాదు. నీ రాత తారుమారు చేయగల చతుర్ముఖ బ్రహ్మదేవుణ్ణీ కాను. మరి నాకు భోజన సమయమయ్యింది" అని లోనికి వెళ్ళిపోయాడు.

లంబోదరమూర్తి తనలో తాను పెట్టినట్టుంది వీడి జ్యోతిషపాండిత్యం. అనుకొంటూ ఇంటిముఖం పెట్టాడు.

దారిలో మనవాళ్ళయ్య అతనిచేయి పట్టి ఆపాడు.

"లోగడ తమరికి రెండు పెళ్ళిసంబంధాలు చూపించాను. అదే అంబాజీపేట అమ్మాయి నల్లగా వుందని, మరో ఉద్యోగం చేసే అమ్మాయికి కాస్త నత్తి అని తెలిసి చేసుకోను పొమ్మన్నారు. ఇప్పుడు మీరు ఓ టెన్‌మినిట్స్ స్పేర్ చేస్తానంటే మరో ఇద్దరి పెళ్ళికూతుర్ల ఫోటోలు చూపిస్తాను" అంటూ ఓ ఫోటో ఇచ్చాడు లంబోదరమూర్తికి మనవాళ్ళయ్య.

అది చూసి పెదవి విరుస్తూ మూర్తి "ఇదిగో పెళ్ళిళ్ల బ్రోకరూ! ఈ అమ్మాయి బాడీ స్ట్రక్చర్, జుట్టు అంతా బాగానే వుంది. ఓ కన్ను నాకు మెల్లకన్నుగా అనుమానంగా వుంది" అని ఆ ఫోటో మనవాళ్ళయ్యకి తిరిగి ఇచ్చేశాడు.

అతగాడు మరో ఫోటో చూపిస్తూ—



"అయ్యో! ఈ అమ్మాయిని చూశారూ! కుందనపు బొమ్మేనుకోండి! నవుస్తూ వుంటే అచ్చం రాజహంసను మరిపిస్తుందనుకోండి" అన్నాడు.

దానిని బాగా పరిశీలించిన మీదట లంబోదరమూర్తి "మూతిమీద మీసాలు మగాడికన్నా బాగా మొలిచాయి. ఫోటోలోనే ఇలాగుంటే నైటు అంతా దారుణంగా కనిపించే వీలుంది. నన్నొదిలేయండి" అని తప్పించుకుని వెళ్ళిపోయాడు మూర్తి.

"మీరెవిధంగా- కాళ్ళదగ్గర కొస్తున్న సంబంధాలన్నిటినీ కాలదన్నుకుంటుంటే ఈ జన్మలో మీకు వివాహం కాదు. నా మాట విని, ఈ రెండో అమ్మాయిని చేసుకుంటే అన్నివిధాలా మీకు మంచి జరుగుతుంది. పెదవిమీద మీసాలదేముంది, రోజూ కాస్త పసుపు రాసుకుంటే అవి ఊడిపోతాయి! అదేమంత ఇబ్బంది గనుక" అన్నాడు.

మూర్తి ముఖం చిట్లిస్తూ చిరాకుతో "బాబూ మనవాళ్ళయ్యా, నీకో దణ్ణం! నన్ను విసిగించకు." అంటూ విసుక్కున్నాడు.

మనవాళ్ళయ్యకు సహనం నశించింది.

ఆలస్యం చెయ్యకుండా "మీరు అన్ని సంబంధాలకూ ఇలా వంకలు పెట్టబట్టే, పెళ్ళికుదిరాక ఆకాశ రామన్న లేఖలు సంధించబట్టే..." అంటూ ఏదో చెప్పబోయాడు.

లంబోదరమూర్తి కూడా "ఇదిగో మేరేజ్ బ్రోకరూ, నీ పెధవ అభిప్రాయాలు నాకేం చెవిలో నూరిపోయక్కర్లేదు. నీకొచ్చే వేలు, వందలు కమీషన్ డబ్బులకోసం మా బ్రతుకుల్ని మీరు తాకట్టు పెట్టేస్తారు. నీకో పెద్ద నమస్కారం! నాకు పెళ్లి జీవితంలో అవ్వక పోయినా బెంగలేదు. నువ్వు ఇంకా నన్ను కొద్ది సేపు విసిగిస్తే పీక పిసికి చంపుతా!" అన్నాడు.

అంతే మనవాళ్ళయ్య అక్కడుంటే ఒట్టు.

వాడు వెళ్ళాక లంబోదరమూర్తి తనలో తాను ప్రతివాడికీ నా పెళ్లి ఒక ప్రహసనంగా అయిపోయింది. నాకు నచ్చే అమ్మాయి కావాలి గాని వాళ్ళకు నచ్చిన కన్యను నేను చేసుకోవడం ఏమిటీ!' అనుకున్నాడు కోపంగా.



కార్టూనస్త్రాలు

అమెరికా సంబంధం



మోడ్రన్ జనరేషన్



మోడ్రన్ వనిత



కొత్త కష్టం



నేటి సదస్సులు



మన నాయకులు





బిజినెస్‌మేన్

కోనె నాగ వెంకట ఆంజనేయులు

"టక్! టక్! టక్!"

"ఎవరది?"

"సేల్స్‌మెన్ మేడమ్! తలుపు తియ్యండి ప్లీజ్! థాంక్స్ మేడమ్!"

తలుపు తెరిచిన వెంటనే పెద్ద పెట్టె కింద పెట్టి భుజానికున్న సంచిలోంచి ఒక వస్తువు... పెట్టెలోంచి ఒక వస్తువు తీస్తూ వివరించడం మొదలెట్టాడు.

"..........."

"ఇది చూడండి మేడమ్! క్లీనింగ్ మెషిన్. మీ యింట్లో చెత్తనంతా నిముషాల్లో క్లీన్ చేసేస్తుంది. మీకే మాత్రం శ్రమ వుండదు రేటు... జస్ట్ మూడువేలు."

"ఒకసారిటు చూస్తారా తలపైకెత్తి!"

"జస్ట్ మినిట్ మేడమ్! యిది చూడండి. రోటీ మేకర్! దీంట్లో పిండి ముద్ద పెడితే క్షణాల్లో వేడి వేడి చపాతీ రెడీ అయిపోతుంది. రెండువేలే!"

"తలెత్తి చూడండి ముందు."

"చూస్తానుగానీ! ఈ ఐటమ్ చూడండి. బెడ్‌లైట్. నీలంరంగు బెడ్‌లైట్. మీ బెడ్‌రూంలో ఆహ్లాదాన్ని పంచుతుంది. మీకైతే పదిహేను వందలే."

"ముందు మీరిటు చూడండంటున్నాను."

"అలాగేగానీ.. ఈ వస్తువు కూడా చూడండి. రంగురంగుల అందమైన గొడుగు... ఎండకీ, వానకీ కూడా పనికొస్తుంది. చాలా చవక వెయ్యి రూపాయలే!"

"అలా తలెత్తకుండా పెట్టెలోంచి వస్తువులు తీయడమేగానీ తలెత్తి చూడరా మీరసలు?"

"అన్నీ చూపించాక ఏకంగా తలెత్తుతాను గానీ మేడం... యిది చూడండి. వాటర్ ఫిల్టర్! స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నీరు మీ సొంతం చేసుకోవాలంటే యిది మీ యింట్లో ఉండాల్సిందే! రేటెక్కువ కాదు ఆరు వేల రెండొందలే!"

"ఖర్మ! తలెత్తి చూడమంటుంటే!"

"ఖర్మ కాదు మేడమ్! ఖుర్మా! ఖుర్మా చేసుకునే పాత్ర యిది. కాపర్ బాటమ్! మీ ఖుర్మా రుచికరంగా నోరూరించేలా చేస్తుంది పాత్ర."

"అయ్యో మహానుభావా! యిప్పుడైనా తలెత్తి చూడండి."

"చూస్తాను మేడమ్! యిదే ఆఖరి ఐటమ్. అందమైన ఫ్లవర్‌వాజ్. దీంట్లో ఉంచిన పూలు ఎప్పటికీ వాడిపోవు. అంత తాజాగా వుంటాయి ఎన్నిరోజులైనా. రేటు మీకు అందుబాటులోనే వుంది. ఏనిమిది వందల యిరవై."

"అయ్యిందా! ఇప్పటికైనా తలెత్తి చూడండి. ఇది మనిల్లే నేను మీ ఇల్లాలిని."

"ఆ"





మే,20

తొలి తెలుగు కార్టూనిస్ట్

శ్రీ తలిశెట్టి రామారావు జన్మదినం!


తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం!!

ఈ సంబరాల్లో మనం
మళ్ళీ కార్టూన్ పోటీలు
పెట్టుకుంటున్నాం...

మీ మీ ఐడియాలను
సిద్ధం చేసుకుని
ఉంచుకోండి



వివరాలు వచ్చే సంచికలో!



కలహాపాకం

గంగాధర్ వడ్లమన్నాటి

హైదరాబాద్ కేంప్‌నుండి తిరిగి వచ్చిన మధు, ఉత్సాహంగా తన ఫ్లాట్‌కి వచ్చి...

ఇల్లంతా కలియజూస్తూ 'అరె, నా బంగారు కొండ ఎక్కడి కెళ్ళింది. ఎప్పుడూ హాల్లో టి.వి. చూస్తూనో... ఏదో పుస్తకం చదువుతూనో... వుండేది.' అనుకుంటూ... రెండు బెడ్‌రూంలూ బాల్కనీలో కూడా చూసి ఎక్కడికెళ్ళుంటుం దబ్బా! అనుకుంటూ...

"ఉషా... ఉషా" పిలిచాడు మధు బిగ్గరగా.

"ఆ" అందామె ఓ మూలనుండి పలుకు తున్నట్టుగా.

"ఎక్కడున్నావ్ ఉషా!" అడిగాడు మళ్ళీ అదే బిగ్గర స్వరంతో.

ఆ పిలుపుతో ఉష పులుపు తిన్నట్టు ఒక్క సారిగా ఉలిక్కిపడి "అబ్బా... ఎందుకలా పిరప కొరికిన కాకిలా అరుస్తున్నారు. నేనెక్క డికెళ్తానని.... వంటగదిలోనే వున్నాను" చెప్పిం దామె చేతిలో ఓ పాత్రతో హాల్లోకి నడిచివస్తూ.

"ను... నువ్వు... వంటగదిలోకి వెళ్ళావా?.. అయినా వంటగదిలో నీకేం పని. మన వంట మనిషి చిలకమ్మ ఎక్కడికెళ్ళి తగలడింది" అడిగాడు మధు కొంచెం భయంగా.

ఆ మాటలకి ఉష కాస్తంత కోపంగా...

"అంటే ఏమిటి మీ ఉద్దేశం. నాకు వంటగది లోకి వెళ్ళే అర్హత లేదు... నాకు వంట రాదు అనేగా అర్థం. నేనూ ఏం కావా లని వెళ్ళలేదు. మన వంటమనిషి ఊరెళ్ళింది. మీరు రెండు రోజుల తర్వాత కేంప్‌నుండి వస్తున్నారు కదా అని ఏదో నా చేత్తో ఇంటి వంట తినిపిద్దామని కూరగాయల బిర్యానీని పొద్దుట్నుండి విశ్రాంతి లేకుండా శ్రమపడి మరీ చేశానండి" చెప్పిందామె.

మధు, ఉషలకి పెళ్ళి దగ్గర దగ్గర ఏడాది కావొస్తోంది.

ఉషని ప్రేమించే పెళ్ళి చేసుకున్నాడు మధు. ఉష అన్నింట్లో చురుకుగా వుంటుంది. కాని వంటే రాదు. అందుకే చిలకమ్మ అనే వంట మనిషిని పెట్టారు. కానీ ఉష, తన స్వహస్తా లతో మధుకి వండిపెట్టి, అతని మెప్పు పొందా లనే ఆత్రుతతో అప్పుడప్పుడూ మధుని ఇబ్బం ది పెడుతూ వుంటుంది.

ఇప్పుడుకూడా మధు ఓ క్షణం ఉష వంక చూస్తూ "అది, మరీ... అరె! ఇప్పుడే నేను బయట తినేసి వచ్చానే. పోన్లే, ఈ పూటకి ఆ బిర్యానీ నువ్వే తినేసెయ్ బంగారం" చెప్పాడు మధు కొంచెం తడబాటు స్వరంతో.

"అర్థమయింది!.... మీరు నేను చేసిన ఈ బిర్యాని తినాల్సి వస్తుందని భయపడి నాతో అబద్ధం ఆడుతున్నారు కదా? మీ ఆరోగ్యానికి నాది హామీ. తినండీ" అంది గారం పోతూ.

"వద్దు. ఇలాంటి తియ్యటి కబుర్లు చెప్పి నన్ను మొహమాట పెట్టి బలవంతం చేయకు. ఇలాగే పోయినవారం కూడా నువ్వు చేసిన ఆ దిక్కుమాలిన వంటకం కొబ్బరికోవా కబాబ్ తిని ఆసుపత్రిపాలయ్యాను. ఆ దెబ్బకి రెండు రోజులు డాక్టరు చుట్టూ తిరిగి, నాలుగు రోజులు మందులు వాడితేగాని అది తగ్గలేదు. అది మాత్రమేనా వారంక్రితం కూడా ఇట్టాగే టి.వి. ఛానల్‌లో చూసి చేసిన విచిత్ర వంట్రైన వెల్లుల్లి పనసకర్ర అనే కర్రీని కొంచెం తిన్నానో లేదో, ఏదో కడుపులో మంట పెట్టినట్టు... ఒళ్ళంతా ఒకటే సెగలూ, పొగలూ!...

కడుపులో పేగులు సూదిల్సలా పూడిపోతా యేమో నన్నంత భయం వేసిందంటే నమ్ము. అంతవరకూ ఎందుకు పోయిన నందే కూడా ఎప్పటిలానే చిలకమ్మనే చికెన్ కర్రీ చేయమని పురమాయిస్తే, ఆ రోజు మన పెళ్ళిరోజూ అది, ఇదీ అని చెప్పి ఏదో రైసిస్ వంటని కొంచెం మార్చి చికెన్‌చింగ్ చేశావ్. ఆ కర్రీ చూడ్డానికి బానే వుంది కానీ, నములుతూంటే బబుల్‌గమ్ లాటాయేలా సాగి సాగి మొత్తానికి తినేసరికి సాయంత్రం అయిపోయి, ముందు మూడు పళ్ళుకూడా కదిలిపోయాయి."

కొంతసేపు ఊపిరి పీల్చుకోవడానికి ఆగి...

"అంతెందుకు నేను హైదరాబాద్ కేంప్‌కి వెళ్ళేముందు కూడా నీ పుట్టినరోజు అనీ... నువ్వెంతో ఇష్టపడి, కష్టపడి నా కోసమే చేశా నని నన్ను బ్రతిమాలి, బామాలి తినిపించా లనుకున్న ఆ ముండిలాయ మూలక్కాడ అనే



వంటకాన్ని వాసన చూస్తూనే రెండు దండాలు వేసుకున్నాను. కనుక ఇక దీన్ని వేయడం నా వల్ల కాదు.... బంగారూ వదిలెయ్. ప్లీజ్" చెప్పాడు మధు ఉష గడ్డం పట్టుకు బ్రతిమాలుతూ.

"ఈ బిర్యాని అలా కాదండి. అది, తూచి చేశాను. అసలు ఇది రుచిచూస్తే మిమ్మల్ని మీరే మరచిపోతారు" చెప్పిందామె.

"అమ్మో! అంటే కొంపదీసి గజిని అయిపోతానంటావా? ఖర్మ" అడిగాడు భయంగా ఆమెవంక చూస్తూ.

"అబ్బా! మీరెప్పుడూ వేళాపాళా లేని వేళాకోళమే. నేనంటోంది ఇది తిన్నాక ఆ రుచిలో మిమ్మల్ని మీరే మైమరచిపోతారు అని అర్థం" చెప్పిందామె ఆ బిర్యానిని అతనికి వడ్డిస్తూ.

"ఓహో! అలా అన్నావా. అయితే మొత్తానికి ఇప్పుడు ఇది తినడం తప్పదన్నమాట" అంటూ వేడిగా వున్న బిర్యానిని చెంచాతో భయంగా తినబోతుండగా ఎవరో వచ్చి..

"సార్" అంటూ పిలిచారు గుమ్మం దగ్గ ర్నుండి.


దాంతో 'బతికాను దేవుడా' అని మనసులో అనుకుని గుమ్మంవైపు చూశాడు మధు.

పొట్టిగా, పొట్టతో చిరునవ్వు నవ్వుతూ– "సార్...! వాచ్‌మెన్ డబ్బులు అడుగు తున్నాడు" చెప్పాడు ఆ అపార్ట్‌మెంట్ మెయిం టెనెన్స్ సెక్రటరీ సుబ్బారావు.

"డబ్బులా? అదెప్పుడూ నెలమొదటి తారీ ఖున కదా మనందరం ఇచ్చేది. మరి ఇప్పుడు ఎందుకూ" అడిగాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"ఇది అతని నెలజీతం కోసం కాదాండీ. అతని హాస్పిటల్‌కీ, మందులకీ అయిన ఖర్చుకోసం అట. అది మిమ్మల్నే అడగమని పంపించాడు" చెప్పాడాయన.

"నన్నే అడగమని పంపిం చాడా. ఏం ఎందుకట? అయినా వాడు హాస్పిటల్‌కి వెళ్తే నేను డబ్బులు ఎందుకిస్తాను" అడిగాడు మధు శుద్ధ వెర్రిమొహంగా.



"అది మరి... వాడు హాస్పిటల్‌కి వెళ్ళడానికి కారణం అమ్మగారేనండి... అందుకే" అంటూ నసిగాడు అతను.

ఆ మాటలు విన్న మధు, కోపంగా ఉష వంకా, బిర్యాని వంకా మార్చి మార్చి చూస్తూ "ఓసినీ... నీకు వంటపై గల ఆసక్తిని వంట బాణలిలో కలిపా... కాయనా నువ్వు ఏ వంట చేసినా నేనే స్వయంగా తిని... కాని గుండె గండాలూ, లోటుపాట్లు చెప్తున్నాను కదా. ఏదో నేను రెండురోజులు ఇంట్లో లేనని చెప్పి వంట ప్రయోగానికి ఆ వాచ్‌మెన్‌ని బలి చేస్తావా?!"

"అది కాదు మధూ..." అని ఏదో చెప్ప బోయిందామె.

"చెప్పు. నాకేం చెప్పొద్దు. పోయిన నెలకూడా ఇలానే ఏదో కోపంలో నీ వంట తిననన్నానని దాన్ని తీసుకెళ్ళి పక్కింటి పిన్నిగారికిచ్చావ్. దాంతో నాకు ఇరవైవేలు వదిలిపోయింది. చెప్పాడు మధు దీనంగా.

"అంటే... ఆమె మన చెల్లెమ్మగారి వంట తినే అంత అస్వస్థత పాలైన పనివాడన్నమాట" అడిగాడు సెక్రటరీ సుబ్బారావు ప్రశ్నార్థకంగా.

"తిన్నందువలన కాదయ్యా... ఆవిడకి ఆ ఫలహారం నచ్చక, ఆవిడ పెంచుకునే కుక్కకి పెట్టిందట. అది ఓ రెండుముద్దలు తిని, తల ని అటూ యిటూ విదిల్చి ఆవిడ పిక్క కరిచి పారిపోయిందట. దాంతో ఆవిడకి అయిన హాస్పిటల్ ఖర్చులూ, పారిపోయిన ఆ కుక్క ఖరీదు, మొత్తం నేనే చెల్లించాల్సి వచ్చింది. పైగా

వాళ్ళ ఇంపోర్టెడ్ బుల్‌డాగ్ ఆ ఫలహార రుచి భరించలేకే పారిపోయిందని విట్కు వేరే. సంతోషించాల్సిన విషయం ఏమిటంటే మేం ఇల్లు ఖాళీ చేసి ఇక్కడికి వచ్చాక మళ్ళీ ఆ కుక్క తిరిగి వాళ్ళింటికే వచ్చిందట. ఆ సంఘటన మరిచిపోకముందే మళ్ళీ ఈ వాచ్‌మెన్‌ది ఒకటా!" చెప్పాడు దిగాలుగా.

అతని మాటలకి సుబ్బారావ్ "సార్, మన వాచ్‌మెన్ హాస్పిటల్‌కి వెళ్ళడానికి అమ్మగారే కారణం అంటే అర్థం మీరనుకున్నట్టుగా ఆవిడ వంట ఏమాత్రం కారణం కాదు. అమ్మగారు వాడ్ని చిన్న కరాటే, కుంగ్‌ఫూలతో చితక బాదే సారట..., అదీ అసలు కారణం" చెప్పాడతను.



అతని మాటలు విన్న మధు, మరోసారి ఉషవంక కోపంగా చూస్తూ "అవ్వ! అవ్వ!!... నువ్వు బంగారం కాదే. ఇత్తడి. అయినా నీకేం వచ్చిందే వచ్చేకాలం. ఏదో మొగుడ్ని కాబట్టి నువ్వెప్పుడెప్పుడూ చిరాకులో కొట్టినా తిట్టినా మనకుండా కుక్కిన పేనులా పడి వుంటున్నాను. కానీ వాడ్ని కూడా మొగుడ్ని కొట్టినట్టు కొడతావా. వాడికసలే నీ దెబ్బలు కొత్త. పాపం ఎలా తట్టుకున్నాడో ఏమిటో. అయినా వాడ్ని ఎందుకు కొట్టినట్టు?"

"ఎందుకా! నాకో పుస్తకం ఇచ్చాడు. ఆ క్షణం లో బాగా కోపం వచ్చి ఓ నాలుగు దెబ్బలు కొట్టి, డొక్కలో రెండు కిక్కులు ఇచ్చాను. అప్పుడు హాస్పిటల్‌లో జాయిన్ అయినట్టు న్నాడు..." చెప్పిందామె తేలిగ్గా.

"పుస్తకం ఇచ్చినందుకు కొట్టావా. అంటే అది అంత ఇవ్వకూడని పుస్తకం అన్నమాట. మంచిపని చేశావ్ బంగారూ..., పెద్దవని నేనూ నాలుగు లేత దెబ్బలు కొట్టి, జనరల్ వార్డ్ నుండి ఏకంగా ఐ.సి.యు. వార్డ్‌కి పంపించి వస్తానుండు" చెప్పాడు మధు కూర్చున్న కుర్చీ లోంచి ఆవేశంగా లేస్తూ.

"అబ్బా మధూ! పుస్తకం అంటే నువ్వనుకున్న ట్టుగా అదేం చెడ్డ రకం పుస్తకం ఏమీ కాదు. వంటల పుస్తకం" చెప్పిందామె.

"వంటల పుస్తకం ఇచ్చాడని కొట్టావా?!... అయినా వాడెందుకు నీకు వంటల పుస్తకం ఇచ్చినట్టు...! కొంచెం వివరంగా వివరించు బంగారూ!" అడిగాడతను అయోమయంగా.

"ఏముంది! మన వంటమనిషి ఊరెళ్ళిం దని మొన్న నేనే అన్నం కూరలూ వండాను. కానీ ఆ రోజు ఎందుకో మనసు బాగోక ఏమీ తినబుద్ధి కాలేదు. దాంతో అవన్నీ ఓ కవర్‌లో పెట్టి మన వాచ్‌మెన్‌కి ఇచ్చేశాను. ఆ మరు సటిరోజు నా మానాన నేను మార్కెట్‌నుండి వస్తుంటే అమ్మగారూ థ్యాంక్ అండీ అన్నాడు. దేనికని అడిగితే... వాడికిచ్చిన ఆ వంటకాల్ని వాళ్ళ చుట్టాలకి పెట్టారట. ఎప్పుడూ కనీసం వారంరోజులుపాటు తిష్టవేసే వాళ్ళ చుట్టాలు, నా వంటల్ని రెండుపూటలు రుచి చూపించే సరికి... అరోజే బయల్దేరి వెళ్ళిపోయారని చెప్పాడు. అందుక్కూడా అప్పుడు నాకు వాడిపై కోపం రాలేదు. కానీ అందుకు వాడు కృతజ్ఞత గా బాగా వంట ఎలా చేయాలో ఐదరై రోజుల్లో నేర్పే పుస్తకం ఇచ్చాడు నాకు. అంతే! నవ్వినా భరించేదాన్ని కానీ నాకు వంటరాదని ఇన్‌డైరె క్ట్‌గా ఆ పుస్తకం ద్వారా చెప్పేసరికి, నాకోపం నషాలానికి అంటి వాడి తాట తీశాను. అంతే!" చెప్పిందామె మూతి బిగించి.




అమె చెప్పడమే ఆలస్యం అన్నట్టుగా కిసుక్కు గా నవ్వేశాడు మధు.

దాంతో సుబ్బారావు కూడా నవ్వాపుకోవా లనుకుంటూనే నవ్వేశాడు. కాని వారిద్దరి నవ్వు చూసిన ఉషకి మాత్రం కోపం రెట్టింపై... ఏం చెయాలో తోచక ఆ వండిన కొత్త వంటకం తీసుకురావడానికి వంటింట్లోకెళ్ళింది.



బొమ్మలు: మల్లిక్



"అదేమిట్రా! ఆ సుబ్బారావ్ హోటల్ బాగానే లాగుతోంది కదా?, మరి నీ హోటల్ ఏమిటి వారం తిరక్కుండా మూసేసావ్?" మిత్రుడిని అడిగాడు మార్తాండం.

"నీకు తెలుసు కదరా! నాకూ, ఆ సుబ్బారావ్‌కీ పడదని. వాడు హోటల్‌లో సెల్ఫ్ సర్వీసింగ్ పెడితే, నేను వెరైటీగా వుంటుందని నా హోటల్‌లో సెల్ఫ్ క్లీనింగ్ అని పెట్టా" అమాయకంగా చెప్పాడు అప్పారావు.



"ఒరేయ్! రంగా! ఆ 'శ్రీ దేవి' సుబ్బారావుకి మన షాపు నేమ్‌బోర్డులు రాయడానికి ఇవ్వకురా అంటే విన్నావా?"

"ఏం రాశాడు సార్?"

"పార్వతీ రైసుమిల్లు బదులు 'శివ' రైసుమిల్లు, పిండి 'అట్'బదులుకి పిండి 'మగ'బదులు, వియ్యం 'అమ్మ' బదులుకి వియ్యం 'నాన్న'బదులు అని రాసి తగలడ్డాడు" భోల్లుమన్నాడు గుర్నాథం.



"ఏమోయ్, బాబూ! అటో! అజంతా దాకా వస్తావా?" అడిగాడు దేవదాసు.

"వస్తా సార్!"

"ఏం పుచ్చుకుంటావ్?"

"రెండు పెగ్గుల విస్కీ" సిగ్గుపడుతూ చెప్పాడు ఆటోదాసు.



"ఏమిటీ! ఆ దిక్కుమాలిన సినిమాని బ్లాకులో టికెట్ కొని మరీ చూశావా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపి.

"అవును. అభిమాన సంఘం వాళ్ళు వందరూపాయల టికెట్‌ని యాభైరూపాయలకి అమ్ముతుంటే... కొని..." అసలు సంగతి చెప్పాడు మూర్తి.



"అమ్మా! కొంచెం ధర్మం చెయ్యి తల్లీ" అడుక్కున్నాడు బిచ్చగాడు.

"ఏమయ్యో! నీ కంటికి నేను తల్లిలా కనబడుతున్నానా?" కస్సుమంది ఇల్లాలు.

"తప్పయిపోయింది, కొంచెం ధర్మం చెయ్యి బేబీ!" కొత్తపాట అందుకున్నాడు బిచ్చగాడు.

-బుద్ధవరపు కామేశ్వరరావు





నవ్వుల రారాజు

ఫ్లాష్‌బ్యాక్

చార్లీచాప్లిన్ దగ్రేట్!

విష్ణుభొట్ల రామకృష్ణ

ఫోన్: 9 4 4 0 6 1 8 1 2 2

ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైననూ... చాప్లిన్ ఏదో ఒక దర్శకుని వద్ద నటించి తన నటనను ప్రదర్శించాలని ఆరాటపడేవాడు. అందువల్ల తన నటనను ప్రదర్శించే అవకాశంతో పాటు ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్గుతుందని చాప్లిన్ ఉద్దేశం కాని... అప్పటికే "చాప్లిన్ అంటే ఎవరిమాట వినడు, చాప్లిన్‌తో కలిసి పని చేయటం, పని చేయించుకోవటం కష్టం" అనే విమర్శలు సర్వత్ర వ్యాపించాయి.

నిజానికి చాప్లిన్ సహజంగానే సున్నిత మనస్కుడు. ఎవరితోనూ గొడవలు పడటం, ఎవ్వరిని దూషించటం వంటి పనులు చేసే మనస్తత్వం కాదు. ఎవరు ఏది చెప్పినా వినే వాడు. కాని తాను ఎంతో ఇష్టంగా, ఎంతో కష్టపడి నిర్మించుకొన్న హాస్యపాత్ర (ట్రాంప్) ను, దర్శకత్వం పేరుతో రకరకాలుగా మార్చి, ఆ పాత్రకు అర్థంలేకుండా చేయటం అనేది చాప్లిన్‌కు నచ్చేది కాదు.

హాస్యం అంటే ఏమిటో కూడా తెలియని డైరెక్టర్లు, నిర్మాతలు హాస్యపాత్రకు రూపకల్పనలు చేయటం చాప్లిన్ మనస్సును బాధ పెట్టింది. అందుకోసం అతను దర్శకులకు సూచనలు చేసినా పెడచెవిన పెట్టడంతో పాత్ర పై వుండే ప్రేమ, మమకారం, అభిమానంతో చాప్లిన్ పాత్రలను మార్చవద్దంటూ దర్శకులతో విభేదించేవాడు. దాన్ని ఎదుటివారు చాప్లిన్‌కు నోటిదురుసు ఎక్కువ అని, చెప్పినపనిని చేయడని ప్రచారం చేయడం మొదలెట్టారు.

ఇది ఒకవిధంగా అతని నటజీవితానికి మాయని మచ్చే అయినా, తను ఇష్టపడే పాత్రను దిగజార్చడానికి మనసు రాక, దర్శకులను ఒప్పించ లేక తనలోని ఆవేదనను ఆక్రోశంగా, ఆవేశంగా వెల్లడించేవాడు చాప్లిన్. అంతేకాని దర్శకులను విమర్శించేవాడు కాదు.

వారి పద్ధతులను మార్చుకోమనేవాడు. పాత్రలకు తగ్గట్టు ప్రాధాన్యత ఇవ్వమని అడిగే వాడు. పాత్రలకు జీవం పోయమని అభ్యర్థించే వాడు.



కాని ఆ దర్శకులు ఈనాటి కొంతమంది దర్శకులవలె పాత్రలమీద తమదైన ముద్ర వుండాలని కాంక్షించేవారు.

అందువల్ల సినిమాల్లో పాత్రలకన్నా దర్శకుల ప్రతిభే ఎస్టాబ్లిష్ అయ్యేది.

ఆ చిత్రం యొక్క విజయం నటించిన నటీనటుల కన్న చిత్రానికి దర్శకత్వం వహించిన దర్శకునికే వచ్చేది. దీనివలన పాత్రలలో సహజత్వం పోతుందని భావించేవాడు చాప్లిన్. ఇటువంటి వాతావరణ చిత్రపరిశ్రమలో ఎప్పుడూ వుంటుందని చాప్లిన్ చెప్పిన మాటలను బట్టి తెలుస్తోంది.

ఇటువంటి ప్రతికూల పరిస్థితులలోను చాప్లిన్ దాదాపు ఐదు సినిమాల్లో నటించాడు.

తన పాత్రకు సంబంధించిన సినిమాలకు తనే కథను ఎందుకు రాసుకోకూడదు? ఆ పాత్రను తనే ఎందుకు దర్శకత్వం వహించ కూడదు? అనే తలంపు కలిగినది.

తాను కథ రాసి దర్శకత్వం వహిస్తే సినిమా తప్పక విజయవంతం అవుతుందని విశ్వసించాడు. ఎందుకైనా మంచిదని తాను ఎంతో గౌరవించే, తన గురువు, మిత్రుడు సెన్నెట్‌ను సంప్రదించాడు.

సెన్నెట్ అతనిలోని పట్టుదల, అతని ఉత్సాహాన్ని గమనించి, గతంలో అతను హాస్యం పండించటంలో వున్న అనుభవాన్ని ఎరిగిన వాడు కావటం వలన, అతన్ని ప్రోత్సహించాలని కథ, దర్శకత్వాన్ని రెండింటిని చేయమని

ప్రోత్సహించాడు.

తను ఇచ్చిన మాటకోసం ఏదైనా చేయటానికి సిద్ధపడేవాడు. అలాగే తనకు నచ్చని విషయాన్ని ఎవరు చెప్పినా, చివరకు తనకు అత్యంత సన్నిహితులు చెప్పినదాన్ని సున్నితం గా త్రోసిపుచ్చేసేవాడు. అంతేగాని ఎదుటివారిని గాయపరిచేట్లు ప్రవర్తించేవాడు కాదు. ఇటు వంటి మనస్తత్వాన్ని నేడు చాలామంది నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఇటువంటి మనస్తత్వం కల్గి ఉన్నట్లైతే ఏ రంగంలోవారైనా విజయం సాధించగలరు. అని చాప్లిన్ నిరూపించాడు.

జీవితంలో తనకు ఎదురైనా సంఘటనల నుండి తాను నేర్చుకొన్న విషయాలను గురించి ముఖ్యంగా తను నటించిన, ప్రేమించిన తన పాత్ర (ట్రాంప్) గురించి చాప్లిన్ ఈ విధంగా స్పదించాడు.

"వీడొక బహుముఖ వ్యక్తి, దేశదిమ్మరి, తిరుగుబోతు, పెద్దమనిషి, కవి, స్వాప్నికుడు, ఒంటరివాడు. ఎప్పుడూ ప్రేమనూ, సాహసాలనూ ఆశించేవాడు. ఒక శాస్త్రవేత్తగా, ఒక సంగీత విద్వాంసుడిగా, ఆటగాడిగా, ఎవరినైనా నమ్మించగలడు. అవసరం, సందర్భం వస్తే ఒక ఆడదాన్ని ఎగిరి తన్నగలడు కూడ. (అంటే కాలితో తన్నటం కాదు. ఎదిరించగలడు అని అర్థం) అదికూడ ఎప్పుడు పడితే అప్పుడు కాదు. బాగా కోపంలో వున్నప్పుడు మాత్రమే" అంటూ తన పాత్రగురించి ఒక సందర్భంలో చాప్లిన్ వివరించాడు.

ఇటువంటి ఒడిదుడుకుల సినిమా రంగంలోని ఆటుపోటుల మధ్య చాప్లిన్ సొంతం గా



తన చిత్రాలు తాను తీసుకోవాలనే నిర్ణయం అతని జీవన పరిస్థితిని మార్చింది.

అతని నిర్ణయం సరైనదేనని తెలిపే సంకేతాలు వెలువడ్డాయి.

అందుకు ఉదాహరణగా "న్యూయార్క్‌నుండి చాప్లిన్ నటించిన సినిమాలకు మంచి గిరాకీ వుంది. ఆ సినిమాలన్నీ బాగా ఆడుతున్నాయి. ప్రజలు చాప్లిన్ నటనను బాగా ఆనందిస్తున్నారు. కాబట్టి మీరు చాప్లిన్ సినిమాలు ఎక్కువగా తీయండి అని టెలిగ్రాంలు రాసాగాయి.

ఆ టెలిగ్రాంలు ఇచ్చిన భరోసాతో చాప్లిన్‌కి తన చిత్రాల నిర్మాణంపై ఆత్మవిశ్వాసం పెరిగింది. అందుకోసం సొంతంగా సినిమాలకు కథలు రాసి, డైరెక్షన్ చేస్తానని తన అప్పుడయిన సెన్నెట్‌ని ఒప్పించాడు.

తన నిర్ణయానికి కారణం అప్పుడు వున్న వాళ్ళకు సినిమా తీయటం సరిగ్గా రాదని, కెమెరాలను సరిగ్గా ఉపయోగించలేరని... ఈ రెండింటిని తాను స్వంతంగా ఉపయోగించ గలను అని... వీటికంటే మెరుగైన చిత్రాలను నిర్మించగలనని, తాను ఇప్పటివరకు నటించిన చిత్రాల అనుభవం, తన ఆలోచనల మీద నమ్మకంతో సొంత చిత్రనిర్మాణానికి సంకల్పించాడు చాప్లిన్.

అలా సంకల్పించి, తన స్వయంకృషితో మొదలుపెట్టిన సినిమా 'కాట్ ఇన్ ది రెయిన్'.

ఇది చాప్లిన్ స్వయంగా దర్శకత్వం వహించిన చిత్రం. ఆ చిత్రం విడుదల అయిన అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శించబడింది.

ఆ చిత్రం విజయం అతనిలో కొండంత ధైర్యాన్ని తెచ్చింది. ఆ ధైర్యమే ఎన్నో చిత్రల రూపకల్పనకు ప్రాణం పోసింది. ఎన్నో ఆలో చనలకు రూపం వచ్చింది. ఎందరో సినీ ప్రేక్షకుల హృదయాలలో పాస్యనటుడిగా నిలిచి పోయే అవకాశం కల్గింది.

అప్పటినుండి తను నటించే సినిమాలకు తానే స్వయంగా కథలను తయారుచేసుకొనేవాడు. కథకు తగ్గట్టు తన పాత్రను సృష్టించుకుని దర్శకత్వం నిర్వహించేవాడు.

ఇలా చాప్లిన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రాలు వరుసగా విజయవంతం కాసాగాయి.

(సశేషం)



సూరేపల్లి విజయ

యాహూ

సీరియల్



మనీ బ్యాంక్ వెనుక వైపు ఓ వ్యాన్ ఆగివుంది. అది ఇందాకటి అపరిచిత వ్యక్తిది కాదు.

ఆ వ్యానులో నుంచి మొహాలకు ముసుగులు వేసుకున్న ఆగంతకులు దిగారు.

ప్రహరీ గోడ మీద నుంచి లోపలికి దిగుతున్నారు.

"చందూ! అటు చూడు.... ఎవరో బ్యాంకు దోచుకోవడానికి వచ్చారు. మనం చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం.... నువ్వోపని చేయి... నేను బ్యాంకు ప్రహరీ దూకి లోపలికి వెళ్తాను. నువ్వు దొంగ దొంగ అని అరువు. కాలనీ అంతా మేలుకుంటుంది. ఈలోగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చెయ్. నాతోపాటు ఆ దోపిడి దొంగలు కూడా పట్టుబడతారు. ఆ విధంగానైనా ఈ బ్యాంకును కాపాడిన వాళ్ళమవుతాం".

చందుకు మనసొప్ప లేదు.

"బాసూ ... దాని వల్ల నువ్వు ఇరుక్కుంటావు"

"అయినా సరే... నేను చెప్పినట్టు చెయ్"

అయిష్టంగానే ఒప్పుకున్నాడు చందు.

విభాకర్ కోటి రూపాయల సంచీతో ప్రహరీ దూకాడు.

అంతకు ముందే ఆగంతకులు దూకారు.

చందు గొంతు పెద్దది చేసి "దొంగలు దొంగలు" ... అని అరిచాడు.

సెంట్రీ ఎలర్ట్‌య్యాడు.

కాలనీలోని వాళ్ళు నిద్రలేచారు.

హడావిడి ... అలజడి ... టెన్షన్ ... క్షణాల్లో అంతా అలర్ట్‌యింది. పోలీసులు నాలుగువైపుల నుంచి బ్యాంకును చుట్టుముట్టారు.

విభాకర్‌తో పాటు ఆగంతకులూ పట్టుబడ్డారు.

✦ ✦ ✦

ఆగంతకులను సెల్‌లోకి నెట్టారు.

విభాకర్‌ని కూడా సెల్‌లోకి నెట్టబోతుంటే... విభాకర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన అపరిచిత వ్యక్తి వచ్చి అడ్డుకున్నాడు.

"అతన్ని వదిలి పెట్టండి" అని ఇన్‌స్పెక్టర్‌కు చెప్పాడు.

"ఇన్‌స్పెక్టర్ అతన్ని వదిలిపెట్టకండి! ఇతను నన్ను" అని ఏదో విభాకర్ అంటుండగానే ఇన్‌స్పెక్టర్ ఆ అపరిచిత వ్యక్తికి సెల్యూట్ చేసాడు.

విభాకర్ విభ్రాంతిగా చూస్తుండి పోయాడు.

"ఆశ్చర్యపోతున్నావా ఫ్రెండ్! రాజ్... ప్రకాష్ రాజ్ ... అయామ్ ప్రకాష్ రాజ్ ఫ్రమ్ సిబిఐ" అంటూ సిబిఐ ఏజెంట్ ప్రకాష్ రాజ్ చేయిచాపాడు.

అప్రయత్నంగా, అసంకల్పితంగా తను చేయిచాపాడు విభాకర్.

"అంతా కన్‌ఫ్యూజన్‌గా వుంది కదూ ... నీకు క్లియర్‌గా చెబుతా ... కొన్నేళ్లుగా క్రితం మన బ్యాంకును దోచుకోవడానికి ఢిల్లీకి చెందిన ఓ ముఠా ప్రయత్నిస్తుందన్న సమాచారం వచ్చింది. ఆ కేసును నాకు అప్పగించారు. మనీ బ్యాంకుని చూడ్డానికి నేను శుక్రవారం వచ్చాను. అదే రోజు అనుకోకుండా మీరు బ్యాంకు దోపిడీ చేసారు. అందులో రహస్య కెమేరాలు వున్న సంగతి మీకు తెలియదు.

ఆ తర్వాత మిమ్మల్ని ఫాలో అయ్యాను. మెల్లమెల్లగా... మీ గురించి ఎంక్వయిర్ చేసాను.

అదే సమయంలో పాస్‌పోర్ట్ కోసం అప్లయ్ చేసావు. ఎంక్వయిరీకి పంపించాను. నువ్వు క్లీన్ అని తెలిసింది.

జరిగిన కథ: విభాకర్, చందు ఇద్దరూ ఫ్రెండ్స్ ప్లస్ నిరుద్యోగులు. డబ్బు సంపాదించడాని కోసం బ్యాంక్ దోపిడి చేయాలని నిర్ణయించుకుంటారు ఇద్దరు. ఒక బ్యాంక్‌ని సెలక్ట్ చేసుకుని, ఆ బ్యాంక్‌ని దోచుకుంటారు. ఆ సొమ్మంతా ఒక పెద్ద బ్యాగులో పెట్టుకుని రైల్వేస్టేషన్‌లో మూలన పడివున్న ఒక బోగీలో పెట్టుకుని ఆ రాత్రి గడుపుతారు మిత్రులిద్దరు. అప్పట్నుంచి ఎవర్ని చూసినా భయంతో గడుపుతుంటారిద్దరు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు హడావుడిగా తిరగడం చూసి టెన్షన్‌తో రాత్రంతా నిద్రలేకుండా గడుపుతారు మిత్రులిద్దరు. ఆ సొమ్ముని బ్యాంక్ వారికి తిరిగిచ్చేయాలని నిర్ణయించుకుంటారు. ఒక ఆగంతకుడు వీళ్ళిద్దరిని అనుసరిస్తుంటాడు.

—ఇక చదవండి...



కేవలం. ఆవేశంలో, అదీ ఓ ఆశయం కోసం నువ్వు పని చేశావని అర్థమైంది. ఎప్పటి నుంచో నిన్ను ఫాలో అవుతూ... నీ మాటలను రహస్యంగా వింటూ... నిన్ను అంచనావేస్తూ వచ్చాను.

బ్లాక్‌మెయిలర్‌గా నాటకమాడి నీ క్యారక్టర్‌ని టెస్ట్ చేశాను.

నీలోని నిజాయితీ నాకు నచ్చింది. అయితే ఢిల్లీలోని ముఠా సోమవారం రాత్రి బ్యాంకును దోచుకుంటున్నట్టు నాకు సమాచారం అందింది. కానీ, వాళ్ళు ఆదివారమే ఆ ప్రయత్నం చేయడం .. నిన్ను కనిపెడుతూ నన్ను నేను ఛేజ్ చేయడం.... దొంగలను పోలీసులకు పట్టించడానికి నువ్వు కూడా పోలీసులకు పట్టుబడేందుకు సిద్ధపడ్డం... ఐ లైక్ యువర్ క్యారక్టర్.

నిజం చెప్పాలంటే నీవల్లనే ఈ రోజు దొంగలు పట్టుబడ్డారు. నీ విషయాన్ని స్పెషల్ కేసుగా పరిగణించాలని నేను అప్పుడే రిపోర్ట్ రాశాను.

అప్పటి వరకూ నీకు నా వ్యక్తిగత పూచీకత్తు కింద బెయిలు వచ్చే ఏర్పాటుచేస్తాను.

దొంగల బారినుంచి నువ్వు బ్యాంకును కాపాడిన హీరోవి .. రేపు పేపర్ చూడు... నీకే తెలుస్తుంది. ఆల్ ద బెస్ట్" విభాకర్ చేతిని ఆప్యాయంగా నొక్కి వదిలాడు ప్రకాష్‌రాజ్.

* * *

ఉపసంహారం ..

మరుసటి రోజు పేపర్‌లో ప్రకాష్‌రాజ్ చెప్పినట్లే "బ్యాంకును కాపాడిన రియల్ హీరో విభాకర్" అని బ్యానర్ ఐటమ్‌గా వచ్చింది.

ప్రకాష్‌రాజ్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా, విభాకర్ మీద ఏ కేసూ లేకుండాపోయింది. అంతేకాదు .. విభాకర్‌కు పోలీసుశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం వచ్చేలా చేశాడు ప్రకాష్‌రాజ్.

కుసుమ వంశీని పెళ్ళి చేసుకుంది.

విభాకర్ అనితల వివాహం జరిగింది.

* * *

విభాకర్...అనితల శోభనం రోజు.

పందిరి మంచం మీద ఇద్దరూ నవ్వులాడుకుంటుండగా వంశీ కిటికీలోనుంచి తల లోపలికిపెట్టి విభాకర్‌ని పిలిచాడు.

"ఏమిటీ క్రైంలో .. క్రైం సెన్స్ లేకుండా .. చదువరలా పొట్టిలాగా కాకుండా బావమరిదివై ప్రతికిపోయావు మ్యాటరేంటో చెప్పు" అన్నాడు.

"బావ బాగుం... ఇంటర్ మెంటర్ బ్యాంకు ఒకటి కొత్తగా ఓపెన్ అయిందిట. మంచి ముహూర్తం .. పెళ్ళి దోచుకుందామా" అడిగాడు మెల్లగా లోగొంతుకతో.

అప్పుడే అటువైపు నుంచి కుసుమ అరిచి లాగేసింది. ఇటువైపు నుంచి అనిత విభాకర్‌ని లాగింది.

వాళ్ళిప్పుడు ఫస్ట్ నైట్ రూమ్‌లో ఉన్నారు.

ప్లీజ్ .. డోంట్ డిస్టర్బ్ దెమ్.

అయిపోయింది



వివిఎమ్

మనవాళ్ళు



నువ్వు! ఎంత ఆరోగ్యంగా...
సుఖంగా వున్నావో తెల్సా!?
ఇల్లు లేదు-పగలు చెట్టు క్రింద
మంచి గాలి పీలుస్తావ్!
చెరువులో హాయిగా స్నానం!
గ్యాసు ఖర్చు...వంట చేయాలన్న
టెన్షన్ లేదు!
చేసుకున్నవాళ్ళకి ఒక్కటే
కూర! నీకు రోజూ పది రకాల
కూరలు
నువ్వింత ఆరోగ్యంగా
వున్నందువల్ల
ఆస్పత్రి ఖర్చు నిల్!
అందుకే...ఎప్పటికీ
నిన్నిలాగే వుంచుతా!
నీ సుఖమే...
నేను కోరేది!!
-AVM

విచారించడానికి సవాలక్ష కారణాలు... డామిట్! ఇందుకేనా మనుషులున్నది?
సృష్టిలో నవ్వే లక్షణం ఉంది ఒక్క మనిషికే! దాన్నలా మరుగున పడేయకండి!
నవ్వుతూ ముందుకెళదాం... ఏమంటారు?.... 'ఐనా....' అంటూ ఏదో చెప్తారా?
ఈ 'ఐనా'లు... 'కానీ'లు ఎందుకు?
ఆ సవాలక్ష కారణాలని మరుగున పడేయడానికే
జనవరి హాస్యానందం సంచిక ముస్తాబవుతోంది.... నిజం!

ఆరోజుల్లో మధురిమలు తల్చుకున్న కొద్దీ తీయగా వుంటాయి. బాధ్యతలు బరువులు లేకుండా
బాల్యం.. ఎవర్నీ లెక్క చేయని యవ్వనం.. ఎవరికైనా గమ్మత్తుగా వుంటుంది.
ఆ గమ్మత్తుల సరదారే ఈ...

రింగ్ల్.... రింగ్ల్....

జనవరి నుంచి ప్రముఖ రచయిత 'బ్నిం' ఏం చెప్తారో విందాం!



ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి కుదిరిన ఆనందంలో
తేలుతుండగా.... ఒక ఫొటో సృష్టించిన కల్లోలంలో
విలావిల్లాడిపోయిన యువకుని పాట్లు మనల్ని నవ్వుల్లో
ముంచెత్తుతాయి. ఆ నవ్వుల్లో మునిగి తేలడానికి సిద్ధంగా ఉండండి!



పెళ్లి ఫొటో

ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఎ.విజయలక్ష్మిరాజు
ఎడతెరిపి లేకుండా కురిపించే నవ్వులవాన జనవరి సంచిక నుంచే..!



పబ్లిక్ టాక్!

చిన్నపిల్లలకు మాత్రమే నచ్చే 'ఢమరుకం'

కార్టూన్ చిత్రాలు ఇష్టపడే వాళ్ళకు, చిన్న పిల్లలకు మాత్రమే 'ఢమరుకం' చిత్రం నచ్చుతుంది.

గ్రాఫిక్‌వర్క్, రవిశంకర్ విలనిజం, దేవీశ్రీ ప్రసాద్ మ్యూజిక్, ఛోటా కె.నాయుడు కెమెరా పనితనం ఈ చిత్రానికున్న బలాలు.

తర్కం గురించి ఆలోచించకుండా కథ విషయానికి వస్తే వేల సంవత్సరాల క్రితం దేవతలు, రాక్షసుల మధ్య జరిగిన యుద్ధంలో రాక్షసులంతా మరణించగా... అంధకాసురు డనే రాక్షసుడు (రవిశంకర్) ఒక్కడే, అతని నమ్మిన అనుచరునితో భూలోకంలో దాక్కుంటాడు. ప్రస్తుత కాలం (క్రీ.శ. 2000) దాన శీలుడు, జమీందారు దేవన్‌కు సూర్యుడు, చంద్రుడు, బుధుడు, గురుడు, శుక్రుడు అయిన అయిదు గ్రహాలు ఒకేచోట కలిసి వున్నవేళలో పార్వతీదేవి అంశతో ఆడబిడ్డ(అనుష్క) పుడుతుంది.

మహేశ్వరి (అనుష్క) ఒక మంచివ్యక్తిని వివాహం చేసుకుంటే లోకకళ్యాణం జరుగుతుందని, అదే ఒక దుష్టశక్తిని పెళ్ళి చేసుకుంటే లోకవినాశనం జరుగుతుందని దేవన్‌తో ఒక స్వామిజీ చెపుతారు.

పదివేల సంవత్సరాల తరువాత తన అనుచరుని పిలుపుతో... అంధకాసురుడు బాహ్య ప్రపంచంలోకి వస్తాడు. మహీని పెళ్లాడిన తరువాత సూర్యగ్రహణం లోపల బలి ఇస్తే ముల్లోకాలకు అధిపతిని అవుతానని భావిస్తాడు. కాని మహీని పెళ్ళాడదానికి వేరే ఒకరు పుట్టి యున్నారని, వాళ్ని అంతం చేస్తే తన కార్యం సులభమౌతుందని రాక్షసుడు భావిస్తాడు.

కాశీ నుంచి తిరిగివస్తున్న మల్లి (నాగార్జున) కుటుంబంపై సర్పాలుగా మారి రాక్షసుడు, మల్లి కుటుంబాన్ని హతమారుస్తాడు.

ఆ ఘటనలో మల్లి, అతని చెల్లెలు తప్పించుకుంటారు. చెల్లెలు అవిటిదౌతుంది. తన కుటుంబానికి జరిగిన అన్యాయంచూసిన మల్లి, శివుణ్ని ఆరాధించడం మానేస్తాడు.

అనాధశరణాలయంలో చెల్లెలు చికిత్స పొందుతుంది.

అక్కడికి సేవ చెయ్యడానికి వచ్చిన మహీని చూసి మల్లి ఇష్టపడతాడు.

మహీని ఎత్తుకు పోయి వివాహం చేసుకోవాలని రాక్షసుడు భావిస్తాడు. రాక్షసుడు మహీని వివాహం చేసుకుంటే లోకనాశనం జరుగుతుందని భయ పడిన కాశీలోని అఘోరాలు మహీని చంపాలని చూస్తారు.

మల్లి, మహీని కాపాడతాడు.

మహీని పెళ్ళాడదానికి ఫారిన్‌నుండి వచ్చిన రాహుల్‌ని రాక్షసుడు చంపి, అతని రూపంలో మహీ ఇంటికి వస్తాడు. మల్లికి సహాయం అందించడానికి శివుడు-సాంబయ్యగా భూమి పైకి వస్తాడు.

మల్లి కారణంగా రక్షసుడు నాశనం కాగా, మల్లి, మహీ పెళ్ళి చేసుకుంటారు.

ఇటువంటి మైథాలజీ కథల్ని, సాంఘిక కథలతో కలిపేటప్పుడు ప్రేక్షకులు ఫీల్ అయితేనే చిత్రం సక్సెస్ అవుతుంది.

కేవలం గ్రాఫిక్స్ ద్వారా పిల్లల్ని తప్ప మిగిలిన ఆడియన్స్‌ని అలరించలేవని అప్పట్లో 'అంజి', ఇప్పుడు 'ఢమరుకం' చిత్రాలు ఋజువు చేశాయి.

రాక్షసులకు 'చావు' అనేది వున్నప్పుడు అతని ఆయుఃప్రమాణం ఎంత అనేది దర్శకుడు ఆలోచించలేదు.

10,000 సం॥ల తరువాత అంటూ చూపించారు. పార్వతి అంశంతో పుట్టిన ఆడపిల్లని రాక్షసుడు పెళ్ళి చేసుకుంటే లోక వినాశనం అవుతుందని చెప్పారే కాని, ఒక సామాన్య మానవుణ్ని పెళ్ళి చేసుకుంటే ఏ విధంగా లోకకళ్యాణం జరుగుతుందో చెప్పలేదు.

గోపాల్ మూవీస్‌లో శివుడు, రాక్షసుడు మనుషుల మధ్యకు రావడం కథలో ఫీల్ మిస్ అయింది.

అదే జానపద చిత్రం అయివుంటే తర్కానికు దూరంగా కొంతవరకు ప్రేక్షకులు ఫీల్ అయ్యేవారేమో!

నాగార్జున సిక్స్‌పాక్ బాడీతో అందంగా, తనకున్న పరిధిలో చాలా బాగా చేసిన, రాక్షసుడుగా చేసిన రవిశంకర్ నటన ముందు ఒక సామాన్యుడుగా నిలిచిపోయాడు.

పార్వతి అంశతో పుట్టిన అనుష్క అందాలకు మాత్రం కొద్దిపాటి మార్కులు పడ్డాయి.

చిత్రం నిండుగా చాలామంది నటీనటులున్నారు. ఓ నలుగురికి తప్ప, మిగిలిన వాళ్ళకు ఒక్క చోటైనా డైలాగ్ లేదు.

నాగార్జున, బ్రహ్మానందం బృందంతో తొలి భాగంలో చేసిన కామెడీ ఎబ్బెట్టుగా వుంది.

ఈ చిత్రంలో దర్శకుని ప్రతిభ చెప్పడానికి స్పెషల్‌గా ఏమీ లేదు.

నిర్మాత అనేవాడు హీరో రేంజ్‌ని బట్టి బడ్జెట్ వేసి, చిత్రాలు తియ్యాలి కాని కథ డిమాండ్ ప్రకారం భారీ బడ్జెట్‌తో తీస్తే పరువు పోతుందని తెలియజేసిన చిత్రం 'ఢమరుకం'.



స్లోగా పేలిన కమర్షియల్ తుపాకి

కొంత తెలివిని, కొంత మానవత్వం కలిపి మురుగదాస్ తీసినచిత్రం 'తుపాకి'.

1000 మందిని చంపడానికి ప్రాణాలు తీసుకుంటున్నప్పుడు వారిని కాపాడటానికి ప్రాణాలు ఇవ్వడంలో తప్పులేదు అనే కాన్సెప్ట్‌ను కమర్షియల్‌గా మలచి, మిలట్రీ బ్యాక్‌గ్రౌండ్‌తో తీసిన చిత్రం ఇది.

టైటిల్, హీరో ఈ చిత్రానికి హెల్ప్ కాలేదు. కాని కేవలం మురుగదాస్ పేరు మాత్రమే హెల్ప్ అయింది.

కథ విషయానికి వస్తే మిలట్రీలో కెప్టెన్‌గా వుండే జగదీష్ (విజయ్) సెలవులపై ఇంటికి ముంబై వస్తాడు. బస్‌లో పర్స్ పోయిందని రొటీన్ చెకింగ్ చేస్తుండగా ఒక ఉగ్రవాది దొరుకుతాడు.

27వ తేదిన ముంబైలో 12 చోట్ల బాంబ్ బ్లాస్టింగ్ కోసం ప్లాన్ చేసివుంటాడు. ఆ టెర్రరిస్టు ద్వారా 12 మంది టెర్రరిస్టులను (స్లీపింగ్ సెల్స్) ఆచూకి తెలుసుకొని వారందర్నీ హీరో తన టీమ్‌మేట్స్ సహాయంతో చంపేస్తాడు.

స్లీపింగ్ సెల్స్‌టీమ్‌కు ఆర్డర్ ఇస్తున్న టీమ్ లీడర్, హీరోను చంపడానికి ముంబై వస్తాడు. జగదీష్ టీమ్‌ను తెలుసుకోవడానికి 5 టీమ్‌లలో ఒక్కొక్కర్ని సెలక్టు చేసుకొని, వారి ఇంటి ఆడపిల్లలను కిడ్నాప్ చెయ్యాలని చూస్తాడు.

జగదీష్‌కి అది తెలిసి అతని చెల్లెల్ని తన టీమ్ నుండి పంపిస్తాడు.

జగదీష్ తన చెల్లెల్ని ట్రేస్ చేస్తూ, 16 మంది టెర్రరిస్టులను చంపి తన ఫ్రెండ్స్ చెల్లెళ్లను కాపాడతాడు.

జగదీష్ టీమ్ మెంబర్ల వివరాలు తెలుసుకున్న, స్లీపింగ్ సెల్ టీమ్ లీడర్, జగదీష్ టీమ్ మెంబర్లలో ఒకర్ని ఫ్యామిలితో సహా చంపేస్తాడు.

మిగిలిన వారిని చంపకుండా వుండాలంటే జగదీష్‌ను ఒంటరిగా రావాలని పిలుస్తాడు.

జగదీష్ వెళ్ళి టీమ్ లీడర్‌ను చంపేస్తాడు.

టీమ్‌లీడర్ చావడంతో స్లీపింగ్ సెల్ టీమ్ మెంబర్లకు ఎటువంటి ఆర్డర్స్ వెళ్ళకపోవడంతో వాళ్ళు ఎటువంటి విద్రోహక చర్యలు చెయ్యలేరని జగదీష్ భావిస్తాడు. కథలో రిలీఫ్ కోసం హీరోయిన్ కాజల్ పాత్రను మలచినట్లున్నారు. కాజల్‌ను హీరో తన పెళ్ళి చూపుల్లో సాంప్రదాయ అమ్మాయిగా ముందు చూసి, పెళ్ళికూతురు నచ్చలేదని చెప్పడం, తరువాత ఆమెను మోడ్రన్‌గా చూసి హీరో ఇష్టపడటం వంటి సన్నివేశాలతో కొద్దిసేపు రిలీఫ్ అందించారు.

ఈ చిత్రం గురించి చెప్పాలంటే మిలట్రీ వాళ్ళు చేస్తున్న త్యాగంవలనే మనం దేశం లోపల సురక్షితంగా ఉన్నామన్నా కాన్సెప్ట్ చాలా బాగుంది.

తమ కుటుంబానికి 11 నెలలు దూరంగా ఉండి, ఫోటోల్లో, ఫోన్‌లో మాత్రమే పలకరించుకుంటూ, మంచులో, ఎండలో, వర్షంలో బార్డర్‌లో ఉంటూ వాళ్ళు చేస్తున్న త్యాగాలు మురుగదాస్ ప్రేక్షకుల్ని ఒక్కసారి గుర్తు చేస్తాడు.

మనకోసం ప్రాణాలు విడుస్తున్న మిలట్రీవాళ్ళు ఎందరో, అలాగే అవిటివాళ్ళుగా మారి జీవనం సాగిస్తున్న మిలట్రీవాళ్ళు ఎందరో, అటువంటి వారి ఆత్మస్థైర్యం చూపించి తనలోని దేశభక్తిని మానవత్వంను దర్శకుడు చాటాడు. ఉగ్రవాదంలో స్లీపింగ్‌సెల్ సమస్యను చూపించి దాన్ని ఎదుర్కొనే విధానాన్ని తన తెలివితేటలతో సామాన్య ప్రేక్షకులకు అర్థమయ్యే విధంగా దర్శకుడు చక్కగా చూపించాడు.

దేశభక్తి చిత్రాన్ని కమర్షియల్ చిత్రంగా తియ్యడంలో మురుగదాస్ సక్సెస్ అయినట్లే.

కాని ఈ చిత్రానికి 'తుపాకి' టైటిల్ కేవలం యూత్‌ని మాత్రమే ఆకట్టుకునే విధంగా ఉంది. మురుగదాస్ తన ప్రతి చిత్రంలో హీరో ఇంట్రడక్షన్‌లో ఒక ఫైట్, ఒక పాట వచ్చే విధంగా (స్టాలిన్, సెవెన్త్ సెన్స్) చూపిస్తుండటం బోర్ కొడుతుంది. మొదట్లో హీరోయిన్ పాత్ర రిలీఫ్‌గా అనిపించినా, తరువాత పాట కోసమే ఆ పాత్ర కనిపిస్తుంది.

హారీస్ జైరాజ్ మ్యూజిక్ ఫరవాలేదు. హీరో విజయ్‌కు తమిళంలో పవన్‌కళ్యాణ్‌కు ఉన్నంత ఇమేజ్ ఉన్నా, తెలుగులో మాత్రం ఆదరణ కరువే. కనీసం ఈ చిత్రమైనా అతనికి తెలుగులో ఒక ఇమేజ్‌ను ఇవ్వకపోతే, ఇకనుండి అతని చిత్రాలు తెలుగులో డబ్బింగ్ చెయ్యడం చేస్తే.

చిత్రం ప్రారంభంలో ప్రొడక్షన్ పేరు జెమిని పిక్చర్ అని తమిళ అక్షరాలతో కనిపించడం వారి భాషాభిమానానికి జోహార్లు అనిపించినా, తెలుగు భాషలో ఈ చిత్రం రిలీజ్ చేస్తున్నప్పుడు కూడా తెలుగులో ప్రొడక్షన్ పేరు చూపించకపోయినా సర్దుకుపోయే మన తెలుగు వారి సహనానికి శతకోటి వందనాలు.

చంద్రశేఖర త్యాడి

పాతతరం హాస్యాన్ని ఈ తరం వాళ్ళకి పరిచయం చేయడమే ఈ నాటి నవ్వులు...

నాటి నవ్వులు

ముడిపడని పేర్లు

-శ్రీ నీలా జంగయ్య

ఆంధ్రప్రదేశ్‌లో కొప్పరపు జంటకవులు, తిరుపతి వేంకట కవులు అవధానాల ద్వారా సాహితీ సామ్రాజ్యం పాలిస్తున్న రోజుల్లో దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, గుర్రం జాషువాగారు ఇద్దరు కలిసి జంట కవులుగా రూపొందాలని ఒకరోజు సమావేశమై సమాలోచించినారట. అయితే కొప్పరపు సోదర కవుల పోలికగాని, తిరుపతి వేంకట కవుల పోలికగాని వారి పేర్లు పూర్వోత్తరాలలోనూ ముడిపడడం కష్టమయింది.

పిచ్చి జాషువా అయినా కావాలి లేదా జాషువా పిచ్చి అయినా కావాలి.

అందుకని జంట కవులుగా మనడానికి పేర్లు కలపడంలో ఇబ్బంది వచ్చి మనపేర్లు పనికిరావని, ఎవరికి వారుగా వారి పేర్లతో లోకప్రతిష్ఠ సమార్జించుకున్నారుట.

అట్లాగే గ్రాంథిక భాషావాదం ఒకవైపున విద్యాలయాల్లో స్థిరపడడానికి ప్రయత్నిస్తుంటే మరోవైపున వ్యావహారిక భాషావాదం వీధుల్లో బాగా కొనసాగుతున్న రోజుల్లో గ్రాంథిక భాషకు వారసునిగా కొక్కొండ వేంకట రత్నంగారు, వ్యావహారిక భాషకు వారసునిగా కందుకూరు వీరేశలింగం పంతులుగారు పట్టుదలలు వీడనివారై రచనలు చేస్తూ వుండేవారని, ఒకరిని గురించి మరొకరు ప్రహసనాలు తరచు రచించు కొంటుండే వారని ప్రతీతి వున్నది.

గ్రాంథిక భాషకు సంబంధించిన ఇతివృత్తం తీసుకొని కొక్కొండ వేంకటరత్నంగారు ఒక ప్రహసనం రచించి అందులో వీరిగానిపాత్ర నొకటి ప్రవేశపెట్టి వాడుకభాషలో వాని సంభాషణ రచించినాడట.

ఆ నాటకం ప్రదర్శించే రోజున వీరేశలింగం గారికి ఆహ్వానం పంపి తిలకించవలసినదిగా కోరినారట. వీరేశలింగంగారు నాటకాన్ని చూసి వీరిగాని పాత్ర తనను గురించేనని వాని భాష వ్యవహార భాష గురించేనని తనను దెప్పి పొడిచినట్లు గ్రహించి వెళ్ళి ఆ మరునాటికే వీరేశలింగం గారు ఒక ప్రహసనం వ్యావహారిక భాషకు ఇతివృత్తంగా మలచి అందులో ఒక నత్తిపాత్ర ప్రవేశపెట్టినారట. ఆ నత్తిపాత్రకు పేరు కొండిగాడు.

ఆ ప్రహసనం ప్రదర్శించే రోజున కొక్కొండవారికి ఆహ్వానం పంపి నారు. వేంకట రత్నంగారు వచ్చి ఆ నాటకాన్ని తిలకించారు.

"ఏరే నీ పేరేమిరా?" అని మరో పాత్ర అడిగినప్పుడు ఆ నత్తిపాత్ర "కొ...కొ్కొండిగాడు" అని పలికినాడట.

వ్యవహార భాషను వీరిగాడు మాట్లాడేదని కొక్కొండ వేంకటరత్నం గారు వీరేశలింగం గారిని మనసులో వుంచుకొని విమర్శిస్తే గ్రాంథిక భాషను నోరు తిరగలేని నత్తివాడు మాట్లాడే భాష అని వీరేశలింగం గారు వేంకటరత్నంగారిని విమర్శించినారు అని లోక ప్రతీతి.

ఇట్లా నవ్వుతెప్పే కృత్యాలు అతుకని పేర్ల మధ్య వ్యక్తుల మధ్య అవతరిస్తాయి. అప్పుడప్పుడు మనం వీటిని జ్ఞాపకం చేసుకొని నవ్వు కొంటుంటాము.

హాస్యము కూడా ఒక రసమే. మన తెలుగు సాహిత్యంలో హాస్యం రకరకాలుగా వుంది. దాన్ని ఇంకా వెలికితీయవలసి వుంది.

ఏమైనప్పటికీ ఈ ముడిపడనితనం పేర్లలో సంఘటనల్లో రూపాల్లో వాగ్ధోరణుల్లో వుంటుంటుంది.

ఒక అధ్యాపకుడు వినయశీలురయిన విద్యార్థులకు పాఠం చెప్పి అర్థమయిందా అని ప్రశ్నించగా, ఒక నత్తి విద్యార్థి లేచి "మీ అక్క కొప్పులో కిచకిచలు" అన్నాడట. తరగతి మొత్తం గొల్లుమని నవ్వింది.

అధ్యాపకుడు ఆ మాటను విద్యార్థితో కాగితంమీద వ్రాసి చూప మన్నాడట. వెంటనే ఆ నత్తి విద్యార్థి "మీ కృప వలన కొంచెం కొంచెం" అని వ్రాయగా అందరూ నిశ్చేష్టులైపోయారట.

హాస్యం ఎన్నెన్ని కోణాల్లో తొంగి చూస్తుందో మనం గ్రహించవలసి వుంటుంది. ఇతిహాసంలో ఇట్లాంటి ఇతిహాసాలు వెదకాలి మరి.

(ఆంధ్రప్రభ)



మీ ఆప్తులకు నవ్వులతో శుభాకాంక్షలు తెలుపండి!

మీకిష్టమైన వారికి.... మిమ్మల్ని ఇష్టపడేవారికి...
మీ శుభాకాంక్షలు... ఆశీస్సులు తెలుపడానికి ఒక చక్కని మార్గం
సిద్ధం చేసింది హాస్యానందం
మీరు చేయవలసినదల్లా... మీరు తెలుపవలసిన
శుభాకాంక్షల వివరాలు, వారి ఫోటో పంపించడమే!

Name: ____________________

Address: ____________________

____

____________________ Ph: ____________________

Matter: ____________________

____

____

ఈ కూపన్ పూర్తి చేసి దానితో పాటు రూ.200/-లు డి.డి.
'పి.రాము' పేర తీసి హాస్యానందం చిరునామాకు పంపండి!

ఒక సంవత్సరం పాటు ఉచితంగా హాస్యానందం అందుకోండి!

మోపూరు పెంచల నరసింహం



గోటూ లాఫ్!

కలియుగాంతం

నలిగిపోయిన చొక్కా, చింపిరి జుట్టుతో తిరిగే జంబులింగం ఈ మధ్య ఇస్త్రీ బట్టలు, మంచి క్రాఫ్‌తో తిరుగుతున్నాడు.

అంతే కాకుండా పావలా పోతే ప్రాణం పోతుందనుకునే జంబులింగం పదివేళ్ళకు పది బంగారు ఉంగరాలు ధరించాడు.

"లాటరీ తగిలిందా?" అని అడిగితే నవ్వి ఊరుకుంటున్నాడు కాని విషయం చెప్పటం లేదు. మెతుకు పోతే బతుకు పోతుందనుకునే జంబులింగాన్ని చూసి కొలీగ్స్ కొంతమంది "కలియుగాంతం అంటే ఇదేనేమోరా!" అని అనుకోసాగారు.

